

స్టడీ అవర్

నో టెన్షన్

ఫైనల్ పరీక్షలు బాగా రాసేద్దాం

పది విద్యార్థులకు మన మాస్టార్లు చెబుతున్న 85 రోజుల ప్లానింగ్

ఈ వ్యూహంతో చదివితే మంచి మార్కులు రావడం కష్టమేమీ కాదు

ఏం చదవాలి ? ఎలా చదవాలి ?

ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం -6లో..

ఆస్తులు.. హక్కులు.. పోరాటాలు



తల్లిదండ్రులు సంపాదించిన ఆస్తులు కావాలి. కాని, వారు వద్దు. కుటుంబం పరువు ఏమైనా పర్వాలేదు. కాని, ఆస్తుల వాటాల విషయంలో రాజీ పడేదే లేదు. ఇలా ప్రతి ఇంట ఆస్తుల వివాదాలు రోజురోజుకు ముదురుతున్నాయి. తమ్ముడికి ఇంటిలోని ఓ గజం ఎక్కువ వెళితే.. తోబుట్టువుకు ఆస్తిలో వాటా ఇస్తే అవి కరిగిపోతాయా ? రక్త సంబంధాల కంటే అవి ఎక్కువా? ఏం ఆలోచిస్తున్నాం మనం.

7



తాము సంపాదించిన, వంశపారంపర్యంగా వచ్చిన ఆస్తుల విషయంలో సోదరీ సోదరులు, తల్లిదండ్రులతో ఘర్షణకు దిగుతున్నారు. పిల్లలకు ఆస్తులు కూడబెట్టాలన్న ఉద్దేశంతో పోగేస్తున్నారు. కాని, ఇలా ఆర్జించిన ఆస్తులపైన చివరి రోజుల్లో వీరికి హక్కు ఉండని పరిస్థితి కనిపిస్తోంది. ఇటీవల జగన్-షర్మిల, మోహన్‌బాబు - మనోజ్-విష్ణు వంటి ప్రముఖుల ఇళ్లల్లో ఆస్తుల వివాదాలు వార్తల్లో చూస్తూనే ఉన్నాం. ఆస్తులు.. హక్కులు.. వివాదాలపై ఆదివారం ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం..

ఆమెకు ఇద్దరు కుమారులు, కుమార్తె. 20 ఏళ్ల క్రితం భర్త చనిపోయారు. వారసత్వంగా వచ్చిన మూడు ఎకరాల చేపల చెరువు, 182 గజాల స్థలాన్ని కొడుకులు, కోడళ్ల వారి పేరున రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. చిత్ర హింసలు పెడుతూ ఇంటి నుంచి గెంటేయడంతో కుమార్తె వద్ద తల దాచుకుంటున్నది. న్యాయం కోసం కలెక్టరేట్‌ను ఆశ్రయించింది.. గొల్లవాని తిప్పకు చెందిన 68 ఏళ్ల రామాయణం నాగమణి.

డీఎంహెచ్‌వోగా డాక్టర్ మాలిని నియామకం

ఏలూరు అర్బన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్‌వో)గా డాక్టర్ ఆర్.మాలిని నియమితులయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా శనివారం డీఎంహెచ్‌వోల బదిలీలు జరిగాయి. ప్రస్తుతం డీఎంహెచ్‌వోగా వున్న డాక్టర్ శర్మిష్టను కృష్ణా జిల్లాకు ప్రభుత్వం బదిలీ చేయగా, గుడివాడ ఏరియా ఆస్పత్రిలో డిప్యూటీ సివిల్ సర్జన్‌గా పని చేస్తున్న డాక్టర్ ఆర్.మాలిని బదిలీపై జిల్లాకు నియమితులయ్యారు. గుండుగొలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్‌గా 1994లో ఉద్యోగ ప్రవేశం చేశారు. ఏలూరు సమీపంలోని పాలగూడెం స్వస్థలం. శనివారంరాత్రి వరకు అధికారిక ఉత్తర్వులు అందలేదని, అందినతర్వాత బాధ్యతల్లో ఎప్పుడు చేరాలో నిర్ణయించుకుంటానని డాక్టర్ మాలిని తెలిపారు.

సమగ్రశిక్ష ఏపీసీగా పంకజ్‌కుమార్ నియామకం

ఏలూరు అర్బన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ (ఏపీసీ)గా డాక్టర్ కురెళ్ళ పంకజ్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనను ఫారిన్ సర్వీసులో ఏడాది కాలానికి డిప్యూటేషన్‌పై ఎస్ఎస్ఏకు ఏపీసీగా నియమిస్తూ విద్యాశాఖ కార్యదర్శి శశిధర్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. కైకలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంగ్ల విభాగం ప్రొఫెసర్‌గావున్న ఈయన ఈ ఏడాది జూలై నుంచి పాలకొల్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిప్యూటేషన్‌పై విధులు నిర్వర్తిస్తున్నారు.

సవాళ్ల స్వాగతం

ఏడేళ్ల విరామం అనంతరం కూటమి ప్రభుత్వం స్థిర నిర్ణయంతో ఎట్టకేలకు సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవంగా ముగిశాయి. అన్నింటిలోనూ తెలుగుదేశం అనుకూలురే ఆధిక్యత సాధించారు. సాగునీటి సంఘాలు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ఆఖరుకి ప్రాజెక్టు కమిటీలు సైతం అన్నీ ఏకగ్రీవమే. తాజాగా సాగునీటి సంఘాలకు ఏకగ్రీవంగా గెలిచిన ప్రతినిధులంతా సంబరాలు చేసుకుంటున్నారు. కాని వీరి కళ్ళెదుటే అనేక సవాళ్లున్నాయి.

ఏకగ్రీవంగా సాగునీటి సంఘాల ఎన్నికలు

- అన్నిచోట్లా కూటమి అనుకూలురే.. ఎక్కడా జాడలేని వైసీపీ
- ఏడేళ్ల అనంతరం తిరిగి రైతు ప్రతినిధులకు బాధ్యతలు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : సాగునీటి సంఘాల ఎన్నికలు జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా ముగిశాయి. గడిచిన 12 రోజుల వ్యవధిలోనే సాగునీటి సలహా సంఘాలు, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, నేడు తాజాగా ప్రాజెక్టు కమిటీలకు ఎన్నిక ఏకగ్రీవంగానే ముగిసింది. ఎక్కడా ఎలాంటి వివాదాలకు తావులేకుండా పోయింది. కూటమిలో భాగస్వామ్య పక్షాలు అనేకచోట్ల నీటి సంఘాల్లో పాతినిధ్యం దక్కించుకున్నారు. టీడీపీ అత్యధికంగా సంఘాల్లోను, మిగతా వాటిలోను ఆధిపత్యం ప్రదర్శించగా జనసేన, బీజేపీ ఎక్కడ వీలైతే అక్కడ సంఘాలను కైవసం చేసుకున్నాయి. రాజకీయ రహితంగా ఎన్నికలు జరిగినా వివిధ పార్టీల అనుకూలురే బరిలో నిలిచి గెలిచారు. జిల్లా వ్యాప్తంగా 356 సాగునీటి సంఘాలు ఉండగా వీటన్నింటిలోను ఎన్నిక సాఫీగా ఏకగ్రీవంగా జరిగింది. వరుసగా మూడుసార్లు వాయిదాపడి నాల్గవసారి ఎన్నికలు జరిగి ఏకగ్రీవంగా ముగిశాయి. ఈ ఎన్నికల్లోను వైసీపీ అక్కడక్కడ అడ్డు తగులుతుందేమోనన్న ఊహాగానాలు సాగినా వైసీపీ ఎక్కడా కనిపించలేదు. ఇప్పటికే ప్రజా వ్యతిరేకతను మూటకట్టుకుని ఉన్న పరిస్థితుల్లో తిరిగి ఈ ఎన్నికల్లో పరాభవం కొనితెచ్చుకోవడం ఎందుకని ఆ పార్టీ అనుకూలురు ఒక నిర్ణయానికి రావడంతో సాగునీటి ఎన్నికలకు దూరంగా మిగిలారు. ఎన్నికలకు ముందే ఎవరెవరు ఎక్కడ పోటీ చేయాలన్న సందిగ్ధత టీడీపీతో పాటు జనసేన, బీజేపీ అనుకూలురుకు ఉంది. అయినా ఎక్కడా తడబడకుండా.. విభేదించకుండా కూటమి నేతలంతా వ్యూహాత్మకంగా వ్యవహరించారు. జనసేన ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న పోలవరం, ఉంగుటూరు నియోజకవర్గాల్లోను, బీజేపీ ప్రాతినిధ్యం వహిస్తున్న కైకలూరులోను ఎక్కడా ఎలాంటి అవాంతరం లేకుండా జాగ్రత్తపడ్డారు. ఆఖరుకి నీటి సంఘాలే కాదు 14 డిస్ట్రిబ్యూటరీ కమిటీల్లోను టీడీపీ అనుకూలురే పూర్తి ఏకగ్రీవ ఆధిక్యత సాధించారు. శనివారం జరిగిన ప్రాజెక్టు కమిటీ ఎన్నికల్లోను టీడీపీ అనుకూలురు ఎన్నికయ్యారు. తమ్మిలేరు ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా యర్రా రమేష్, ఉపాధ్యక్షుడిగా గూండా వెంకన్న, ఎర్రకాల్వ ప్రాజెక్టు కమిటీకి అధ్యక్షుడిగా అంజనాగ వెంకటరమణ, ఉపాధ్యక్షుడిగా వాడపల్లి రాధాకృష్ణ ఎన్నికయ్యారు. నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలు సూచించిన వారంతా ఆయా స్థానాల్లో కుదుటపడ్డారు. కూటమి అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో జరిగిన తొలి ఎన్నికలివి. ఈ ఎన్నికల్లో కూటమి ఆసాంతం పైచేయి సాధించగా వైసీపీ ఎక్కడా అడ్రస్సు లేకుండా పోవడం గమనార్హం.

ఇక సవాళ్ల ఎదురీత

ఎన్నికల్లో సాగునీటి సంఘాల దగ్గర నుంచి ప్రాజెక్టు కమిటీ వరకు ఎన్నికలు ఏకగ్రీవంగా ముగిసినా ఆయా స్థానాల్లో గెలుపొందిన ప్రజాప్రతినిధులందరికీ కళ్ళెదుట ఎన్నో సవాళ్ళు. ఎదురీత కనిపిస్తోంది. ఎందుకంటే ఇప్పటివరకు ఐదేళ్ల పాటు వైసీపీ ప్రభుత్వం సాగునీటి కాల్వల నిర్వహణను నిర్లక్ష్యం చేసింది. ఏటా సాగాల్సిన ఆధునికీకరణ పనులను పైసా విదల్చలేదు. ఆఖరుకి కాల్వల్లో కర్రనాచు, గుర్రపుడెక్క తొలగించడానికి నిధులు కేటాయించలేకపోయారు. కాల్వల్లో లాకుల గేట్లకు కనీస మరమ్మతులు చేసేందుకు కార్యాచరణ లేకుండా పోయింది. పూడిక తీసి చాలాకాలమైంది. దీంతో నీటి ప్రవాహ లభ్యత, వేగం రెండూ దెబ్బతిన్నాయి. ప్రధాన కాల్వలతో పాటు పిల్ల కాల్వల నిర్వహణ ఏనాడో మరిచారు. వీటన్నింటికీ మరమ్మతులు నిర్వహిస్తేనే సాగునీరు సక్రమంగా సాగడంతో పాటు రైతులకు ఉపయుక్తంగా ఉంటుంది. లాకుల గేట్లకు ఇంతకుముందు ప్రతీ రెండేళ్లకో సారి నిర్వహణ ఎలా ఉందో గమనించే వారు. గత ఐదేళ్లపాటు వైసీపీ ప్రభుత్వంలో అసలు నిర్వహణ అనే పదం లేకుండా చేయడంతో లాకుల గేట్లు అనేకచోట్ల మరింత దెబ్బతిన్నాయి. గేట్లను ఎత్తిందుకు, దించేందుకు అనువైన పరిస్థితులులేవు. కాల్వలు నిండా చెత్తాచెదారంతో నిండే ఉన్నాయి. గుర్రపుడెక్క కమ్మేయడంతో నీటి ప్రవాహ వేగానికి బ్రేక్ పడింది. ఫలితంగా శివారు ప్రాంతాలకు నీరందడం కష్టసాధ్యంగా మారింది. కృష్ణకాల్వ నిర్వహణ పనులను రెండేళ్ల క్రితం తూతూ మంత్రంగా చేపట్టారు. కాని ఇప్పుడు ఆ కాల్వ అత్యంత దారుణంగా మారింది. ఏలూరులో ఉన్న తూర్పు, పడమర లాకులు నిర్వహణ లోను అనేక సమస్యలున్నాయి. ఇలా ఒకదాని వెంట ఒకటి వైసీపీ పుణ్యమా అంటూ రెండిం తలయ్యాయి. ఇప్పుడు వీటికి నిర్వహణ చేయాలన్నా, మరమ్మతులు చేపట్టాలన్నా కోట్ల రూపాయల వ్యయం కాబోతుంది. ఎర్రకాల్వ, తమ్మిలేరు ప్రాజెక్టుల్లోను ఇదే తరహా నిర్లక్ష్యం. జపాన్ బ్యాంకు నుంచి నిధులు ఇచ్చినా తమ్మిలేరుకు వైసీపీ హయాంలో మోక్షం లేకుండా పోయింది. ఎర్రకాల్వ ఆధునికీకరణ ఎప్పుడో మూలన పడింది. జల్లేరు గేట్లు అంతంత మాత్రంగా ఉన్నాయి. ఎల్ఎన్‌డీ పేట రిజర్వాయరు పూడికమయమైంది. ఈ సమస్యలన్నీ అధిగమించాల్సిన బాధ్యత కొత్తగా ఎన్నికైన డిస్ట్రిబ్యూటరీ, ప్రాజెక్టు కమిటీలు భుజాన వేసుకోవాలి. ఇది జరగాలంటే రాష్ట్ర ప్రభుత్వం -మిగతా 8లో



ఎర్రకాల్వ ప్రాజెక్టు కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌లను సత్కరిస్తున్న కూటమి నాయకులు

మృతదేహం ఎవరిది?

యండగండిలో టెన్షన్ టెన్షన్

- తెలుగు రాష్ట్రాలను కుదిపేసిన మృతదేహం డోర్ డెలివరీ కేసు
- ఆస్తుల కోసం కుటుంబంలో తగాదా.. వదినను భయపెట్టేందుకే మరిది యత్నం!
- సూత్రధారి ఇతనేనని.. ఆచూకీ కోసం గాలిస్తున్న పోలీసు ప్రత్యేక బృందాలు



ఉండి/భీమవరం క్రైం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరి జిల్లా యండగండిలో సంచలనం సృష్టించిన 'పార్శిల్‌లో మృతదేహం డోర్ డెలివరీ' కేసులో ఇప్పుడు అందరినీ వేధిస్తున్న ప్రశ్నలు డెడ్ బాడీ ఎవరిది ? ఎందుకు పార్శిల్ రూపంలో సాగి తులసికి పంపించారు? ఈ కేసులో కీలక సూత్రధారి ఎవరు ? అని. వీటిని ఛేదించేందుకు పోలీసులు సీరియస్‌గా దృష్టి పెట్టారు. రెండు రోజుల్లో కేసులోని నిజాలను వెలికితీసి వెల్లడిస్తామని ఎస్పీ నయీం అస్మి చెప్పారు. ఈ క్రమంలోనే విస్తుపోయే నిజాలు వున్నట్టు చెబుతున్నారు. ఒంటరిగా వుంటున్న ముదునూరి రంగరాజు పెద్ద కుమార్తె సాగి తులసికి పంపించిన మృతదేహం ఎవరిది ? ఒక అనామకుడిది కావాలనే పార్శిల్ చేసి పంపించినట్లు ప్రచారం జరుగుతోంది. ఆమెను బెదిరించి ఆస్తి మొత్తం ఎలాగైనా కాజేయాలనే పన్నాగం పన్నాడా ? అలా అయితే మృతదేహం వస్తే పోలీసులకు దొరికిపోయే అవకాశం ఉందని తెలిసినా ఎందుకిలా చేశాడు ? ఆటోలో మృతదేహం పార్శిల్‌కు అప్పగించిన ఆ మహిళ ఎవరనేది తెలిస్తే వివరా లు వెల్లడవుతాయి. ఆమె సాగిపాడు వద్ద స్క్రాప్ కట్టుకుని ఆటో డ్రైవర్‌కు ఫోన్ చేసి రప్పించి యండగండి పంపించింది. ఆమె కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఆటో డ్రైవర్ పిప్పరకు చెందిన వ్యక్తిగా చెబుతున్నారు.

ఆస్తి వివాదం

రంగరాజుకు చెందిన మూడు ఎకరాల పొలం విషయంలోనే ఇద్దరు అక్కాచెల్లెళ్ళు తగాదా పడుతున్నట్లు సమాచారం. మృతదేహం డెలివరీ చేసిన తర్వాత చిన్నకుమార్తె రేవతి, ఆమె భర్త సిద్ధార్థవర్మ (సుధీర్) కనిపించడం లేదు. పార్శిల్ బుధవారమే వచ్చిందని స్థానికులు చెబుతున్నారు. బాక్సులో నుంచి దుర్వాసన వస్తోందని, త్వరగా రావాలని గరగపర్రులో వుంటున్న తులసికి చెప్పినట్లు తెలిపారు. అయితే ఈ పార్శిల్ బాడీ వచ్చిన తరువాత విప్పింది అతనేని అంటున్నారు. దీనిని చూసిన తులసి భయభ్రాంతులకు గురైనట్లు సమాచారం. ఆ తర్వాతే అక్కడ నుంచి సిద్ధార్థ వర్మ పరారైనట్లు చెబుతున్నారు. అతనిని హైదరాబాద్‌లో అరెస్ట్ చేసినట్లు సమాచారం. ఇతను మొత్తం మూడు పెళ్లిళ్ల చేసుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. రేవతి రెండో భార్య అని చెబుతున్నారు.

నాలుగు బృందాలు గాలింపు

తులసి తల్లిదండ్రులు రంగరాజు, హైమావతి, చిన్నకుమార్తె రేవతిలను ఉండి స్టేషన్ నుంచి ఆకివీడు తరలించారు. ఒక్కొక్కరిని విచారిస్తున్నారు. హైమావతి ఫిర్యాదు మేరకు ఎఫ్ఆర్ నెం.252-24 యు-ఎస్ 194 బిఎన్ఎస్ఎస్ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.నిందితుల కోసం 4 బృందాలు గాలిస్తున్నాయి.

రెండు రోజుల్లో తేలుస్తాం : ఎస్పీ



సిద్ధార్థవర్మ ఫోన్‌లో ఆరు సిమ్‌లు మార్చినట్టు పోలీసు దర్యాప్తులో వెల్లడైనట్లు సమాచారం. దీనిపై జిల్లా ఎస్పీ నయీం అస్మి వీరవాసరంలో విలేకరులతో మాట్లాడుతూ పార్శిల్ డెడ్‌బాడీ కేసు దర్యాప్తు కొనసాగుతోంది. శుక్రవారం చాలా క్లూస్ వచ్చాయి. డిజిటల్ ఎవిడెన్స్ కలెక్ట్ చేశాం. అసలు నిందితుడు దొరికితే కేసును క్లోజ్ చేస్తాం. ఫ్యామిలీ గొడవలు, శత్రువుల గురించి విచారణ చేస్తున్నాం. మృతదేహం ఎవరిది అనేది తేలాల్సి ఉంది. మిస్సింగ్, గుర్తు తెలియని మృతుల వివరాలను ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల్లో విచారణ చేస్తున్నాం. మృతదేహం పోస్టుమార్టం వీడియోగ్రఫీ చేస్తున్నాం. మరిన్ని క్లూస్ దొరికే అవకాశం ఉంది. రెండు రోజుల్లో కేసు క్లోజ్ చేస్తాం' అని ఎస్పీ వివరించారు.

టెన్షన్ వద్దు !



స్టడీ అవర్

పది పరీక్షలకు ప్రభుత్వం డేట్ ప్రకటించింది.. ఇప్పటి వరకు చదివింది ఒక ఎత్తయితే.. ఇక్కడి నుంచి పొందే ప్రిపరేషన్ బట్టే ఫలితాలు ఉంటాయి. వచ్చే ఏడాది మార్చి 17 నుంచి పది పరీక్షలు ప్రారంభం కానున్నాయి. సుమారుగా మరో 85 రోజుల వ్యవధి మాత్రమే మిగిలి ఉంది. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల సూచనలు తీసుకుని వాటి ప్రకారం ప్రకారం ప్రణాళికాబద్ధంగా చదువుకుంటే విద్యార్థులు భయపడాల్సిన పనిలేదు. ఇందులో భాగంగా 'ఆంధ్రజ్యోతి' తనవంతు బాధ్యతగా పదో తరగతి పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న విద్యార్థుల మేధస్సుకు పదును పెట్టడం ద్వారా అత్యుత్తమ మార్కులు సాధించడానికి టెన్త్ బోధించే ఆయా సబ్జెక్టుల నిపుణుల సూచనలు, పాటించాల్సిన మెళకువలతో చేసిన ఓ ప్రయత్నమే ఈ ప్రత్యేక కథనం. ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి మార్కులు తెచ్చుకునే అవకాశం ఉందని సబ్జెక్టు నిపుణుల భరోసా ఇస్తున్నారు.

పది పరీక్షలకు మరో 85 రోజులు
ప్రణాళికాబద్ధంగా చదవండి
టాప్‌స్కోరర్ మీరూ కావచ్చు
పరీక్షల ప్రశ్నావళిపై సబ్జెక్టు నిపుణుల టిప్స్

ఏలూరు అర్బన్/నిడమర్రు/భీమవరం రూరల్ డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పాఠశాల విద్యలో తుదిమెట్టుగా పరిగణించే పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫీవర్ మొదలైంది. ఈ విద్యా సంవత్సరంలో నూతన సిలబస్‌తో కూడిన పాఠ్యపుస్తకాలు ప్రవేశపెట్టడంతో చాలామంది విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు ఎలా రాయాలోనన్న ఒకింత భయాందోళనల్లో ఉన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా నుంచి బాలురు 12,635 మంది, బాలికలు 11,553 మంది పరీక్ష రాయనున్నారు. ఏలూరు జిల్లా నుంచి ఈ దఫా టెన్త్ పరీక్షలకు దాదాపు 400 ప్రభుత్వ, ప్రైవేటు హైస్కూళ్ళ నుంచి మొత్తం 25,159 మంది బాలబాలికలు సిద్ధమవు తున్నారు. వీరిలో ఈ ఏడాది ప్రవేశపెట్టిన నూతన సిలబస్ పాఠ్య పుస్తకాలతో పరీక్షలకు 23,031 మంది రెగ్యులర్ విద్యార్థులు, ఇప్పటికే పాత సిలబస్ టెక్స్ బుక్స్‌తో పరీక్షలు రాసి ఒకసారి ఫెయిలై ఆయా సబ్జెక్టుల్లో మళ్లీ పరీక్షల రాయనున్న 2,128 మంది ప్రైవేటు విద్యార్థులున్నారు. వందరోజుల కార్యాచరణ ప్రణాళికతో మార్చి పదో తేదీవరకు అటు విద్యార్థులు, ఇటు టీచర్లకు సైతం ఊపిరి సలపనంత బిజీ షెడ్యూలును విద్యాశాఖ ఇప్పటికే అమలు చేస్తోంది. ఇప్పటికే విద్యార్థులందరికి సిలబస్ పూర్తయి రివిజన్‌లోకి వచ్చేశారు.రివిజన్ ప్రిపరేషన్‌లోనే విద్యార్థులు ప్రణాళికగా వెళ్లడంతో పాటు నమూనా పరీక్షా పేపర్‌ను పలుమార్లు పూర్తి చేయడం వల్ల పరీక్షల్లో మంచి మార్కులు సాధించవచ్చునని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు.

హిందీ.. భయమెందుకు ?



ద్వితీయభాష హిందీ మంచి స్కోరింగ్ సబ్జెక్టు.. వందకు వంద మార్కులు తెచ్చుకోవచ్చు.. బాగా చదివితే అద్వితీయ మార్కులు ఖాయం..ఉంగుటూరు మండలం నారాయణపురం జడ్పీ హైస్కూలు స్కూల్ అసిస్టెంట్ ఎస్.లక్షణ కుమార్ హిందీలో మంచి మార్కులు తెచ్చుకునేందుకు పలు సూచనలు చేశారు..

వంద మార్కుల ప్రశ్నపత్రంలో ప్రశ్నల స్వభావం ఎలా ఉంటుందంటే

- సెక్షన్-1లో 12 మార్కులకు వ్యాకరణాంశాలు బహుళైచ్ఛిక ప్రశ్నలు 12 ఉంటాయి. ప్రతీ ప్రశ్నకు మూడు ఆప్షన్ల నుంచి సరైన దానిని జవాబుపత్రంలో రాయాల్సి ఉంటుంది.
- సెక్షన్-2లో 13వ ప్రశ్నగా పాఠ్య పుస్తకంలోని గద్యపాఠం నుంచి ఒక పేరా ఇచ్చి దానినుంచి 5 ప్రశ్నలు ఇస్తారు. పేరాగ్రాఫ్ చదివి ఆ ప్రశ్నలకు ఏక వాక్యంలో జవాబు రాయాల్సి ఉంటుంది.
- 13వ ప్రశ్నకు విద్యార్థులు చదవాల్సిన గద్య పాఠ్యాంశాలు ఏమిటంటే 1. పత్‌ఝడ్ మే టూటీ పత్తియాం, 2. డయరీ కా ఏక్ పన్నా.
- 14వ ప్రశ్నగా పాఠ్య పుస్తకంలోని పద్యపాఠం నుంచి ఒక పద్యాంశం ఇచ్చి దానినుంచి 5 ప్రశ్నలు ఇస్తారు. చదవాల్సిన పద్య పాఠ్యాంశాలు 1. మనుష్యత, 2. పర్వత్ ప్రదేశ్ మే పావస్, 3. తోప్
- 15వ ప్రశ్నగా పాఠ్యపుస్తకం నుంచి కాకుండా ఒక గద్యాంశం నుంచి 5 బహుళైచ్ఛిక ప్రశ్నలు ఇస్తారు. వాటికి సరైన ఆప్షన్లను జవాబుపత్రంలో రాయాలి.
- 16వ ప్రశ్నగా పాఠ్యపుస్తకం నుంచి కాకుండా ఒక పద్యాంశం నుంచి 5 బహుళైచ్ఛిక ప్రశ్నలకు జవాబులను రాయాల్సి ఉంటుంది.
- 17వ ప్రశ్నగా పాఠ్యపుస్తకంలోని కవి జీవన పరిచయం నుంచి 2 ప్రశ్నలు ఇస్తారు. ఒకదానికి రాయాల్సి ఉంటుంది. వీటిలో 1. ప్రాచీనకవి (కబీర్, మీరాబాయి), 2. ఆధునిక కవి (మైథిలీ శరణ్ గుప్తా).
- 18వ ప్రశ్నగా లేఖక్ పరిచయ్ ఒక పేరాగ్రాఫ్ ఇచ్చి 5 ఖాళీలు పూరించమని అడుగుతారు. (లీలాధర్ మండలోయి).
- 19వ ప్రశ్ననుంచి 26వ ప్రశ్నవరకు మొత్తం 8 ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు 4 మార్కు లుంటాయి. 6 ప్రశ్నలకు మాత్రమే జవాబులు రాయాల్సి ఉంటుంది. 19వ ప్రశ్న సాఖీలోని మొదటి 4 దోహాల నుంచి ఒక దోహా ఇవ్వబడుతుంది. వీటిలో పద్యభాగం నుంచి 3, గద్యభాగం నుంచి 3, ఉపవాచకం నుంచి 2 ప్రశ్నలు ఇవ్వబడతాయి. ముఖ్యమైనవి...1. పర్వత్ ప్రదేశ్ మే పావస్, 2. కర్ చలే హమ్ ఫిదా, 3. డయరీ కా ఏక్ పన్నా, 4. తతారా వామీరోకథా, 5. హరిహర కాకా. ప్రశ్నకు 4 మార్కులు కేటాయించినందున జవాబుకుముందు పాత్ కా నామ్, విధా-జన్మ్, తదితర విషయాలు రాయడం ద్వారా మంచి స్కోర్ సాధించవచ్చు.
- 27వ ప్రశ్నగా రెండు ప్రశ్నలు ఇస్తారు. ఒక ప్రశ్నకు జవాబు ఇస్తే సరిపోతుంది. పద్యభాగం నుంచి 1. మీరా-పద్, 2. పర్వత్ ప్రదేశ్ మే పావస్ చదివితే మంచిది.
- 28వ ప్రశ్న గద్యభాగం నుంచి 2 ప్రశ్నల్లో ఒకదానికి జవాబు రాయాలి. ఇందులో 1. బడే భాయి సాహెబ్, 2. పత్‌ఝడ్ మే టూటీ పత్తియాం చదివితే మంచిది. కనీసం 8 వాక్యాలకు తగ్గకుండా జవాబు రాయాలి.
- 29వ ప్రశ్నగా లేఖ ఉంటుంది. రెండు లేఖల్లో ఒకటి రాయాలి. లేఖ ఖచ్చితంగా ఫుల్‌పేజీలో రాయాల్సి ఉంటుంది. ముఖ్యమైనవి...1.చుట్టీపత్ర్, 2.పితాకో పత్ర్, 3.మిత్ర్‌కో పత్ర్, 4.పుస్తక్ విక్రేత కే నామ్ పత్ర్.
- 30వ ప్రశ్నగా నిబంధ్ వ్యాసం 5 అంశాల్లో ఒకటి రాయాల్సి ఉంటుంది. 1.దీపావళి, 2.దూరదర్శన్, 3.పర్యావరణ్ ఔర్ ప్రదూషణ్, 4.పుస్తకాలయం, 5.విద్యార్థి అనుషాశన్. వ్యాసం రాసేటపుడు మంచి మార్కులు పొందడానికి నిబంధ్ కీ రూప్ రేఖా రాసి సైడ్ హెడ్డింగ్స్‌తో రాయాలి. అందమైన దస్తూరి మంచి మార్కులకు ఓ టిప్.

ఓవరాల్‌గా వందమార్కుల ప్రశ్నపత్రం ప్యాటర్న్ ఇలా ఉంటుంది. సెక్షన్-1లో 1నుంచి 12 ప్రశ్నలు 12 మార్కులకు, సెక్షన్-2లో 13 నుంచి 16 పశ్నలు 20 మార్కులకు, సెక్షన్-3లో 17,18 ప్రశ్నలు 10 మార్కులకు, సెక్షన్-4లో 19 నుంచి 26 ప్రశ్నలు 24 మార్కులకు, సెక్షన్-5లో 27, 28 ప్రశ్నలు 16 మార్కులకు, సెక్షన్-6లో 29, 30 ప్రశ్నలు 18 మార్కులకు కలిపి మొత్తం వందమార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది.

ట్రిక్స్ తెలిస్తే మేథమేటిక్స్‌లో మార్కులు మీవే..



లెక్కల సబ్జెక్ట్ మీద ఎవరికి పట్టు ఎక్కువగా ఉంటుందో వాళ్లదే క్లాస్‌లో పైచేయిగా ఉంటుంది. గణితంలో ప్రాక్టీస్ ఎక్కువగా చేయడం ద్వారా టాప్ స్కోరర్‌గా నిలబడవచ్చని పిప్పర ఉన్నత పాఠశాల మ్యాథ్స్ హోతా ఆంజనేయులు చెబుతున్నారు. పేపర్‌లో మొత్తం 4 సెక్షన్లు ఉంటాయి.

- సెక్షన్ -1 లో 12 ప్రశ్నలు వస్తాయి. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున 12 మార్కులు. 1-12 వరకు వాస్తవ సంఖ్యలు, బహుపదులు, రేఖా సమీకరణాలు, వర్గ సమీ కరణాలు, శ్రేడులు మరియు వృత్తాలు, సంభావ్యత, సాంఖ్యక శాస్త్రంలపై ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది.
- సెక్షన్ -2లో 2 మార్కులు ప్రశ్నలు 8 ఉంటాయి. మొత్తం 16 మార్కులు 13 - 20 వరకు ప్రశ్నలలో బహుపదులు,వాస్తవ సంఖ్యలు, నిరుపమాన జ్యామితి, త్రికోణమితి, సంభావ్యతలపై ప్రశ్నలు వస్తాయి.
- సెక్షన్ -3లో 4 మార్కుల ప్రశ్నలు 8 వస్తాయి మొత్తం 32 మార్కులు. 21 నుంచి 28 వరకు ప్రశ్నలు ఉంటాయి. శ్రేడులు, త్రిభుజాలు, జ్యామితి, వాస్తవ సంఖ్యలు, సంభావ్యతలపై ప్రశ్నలు వస్తాయి.
- సెక్షన్ 4 లో 8 మార్కులు ప్రశ్నలు 5 వస్తాయి. మొత్తం 40 మార్కులు..29 నుంచి 33 ప్రశ్నలలో ప్రతి ప్రశ్నకు చాయిస్ ఉంటుంది. దీనిలో కరణీయ సంఖ్యలు రుజువు, ఒక- గ్రాఫ్ - రెండు చరరాశులు, సంభావ్యతలో పేకముక్కలు, పాచికలు, నిరుపమాన జ్యామితి, త్రిభుజాలు, శ్రేడులపై ప్రశ్నలు వస్తాయి. మొత్తం మీద వాస్తవ సంఖ్యలు, శ్రేడులు, జ్యామితి, కరణీయ సంఖ్యలు, సంభావ్యత, బహుపదులు టాపిక్స్ బాగా ప్రిపేరవ్వాలి.

ఇంగ్లీష్..ఈజీగా





ఇంగ్లీషులో మంచి మార్కులు సాధించడం కోసం పాటించాల్సిన ముఖ్యమైన అంశాల గురించి గణపవరం బాలికోన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ కె. హిమగిరి వివరించారు.. ఇంగ్లీషు పరీక్ష పేపరులో మూడు సెక్షన్లు ఉంటాయి.

సెక్షన్-ఎ : 30 మార్కులు

పేరాగ్రాఫ్ ఇస్తారు ఐదు ప్రశ్నలు ఇస్తారు. ప్రతి ప్రశ్నకు 2 మార్కులు చొప్పున 10 మార్కులు ఉంటాయి. 6 -10 ప్రశ్నలు వరకు పొయిట్రీ పేరా ఇచ్చి 5 ప్రశ్నలు అడుగుతారు. హేవ్లాక్, ది నేచర్‌పై ప్రశ్నలు వస్తాయి. 11-15 వరకు నాన్ డిటెయిల్ పేరా ఇచ్చి 5 ప్రశ్నలు వస్తాయి. 16వ ప్రశ్నగా డయాగ్రామ్ ఉంటుంది. 5 ప్రశ్నలకు 5 మార్కులు ఇస్తారు. 17వ ప్రశ్నగా జంబులింగ్ సెంటెన్సెస్ 5 ఉంటాయి. వాటికి 5 మార్కులు

సెక్షన్-బి - 40 మార్కులు

గ్రామర్ రిలేటెడ్‌గా ప్రశ్నలు ఉంటాయి.. గ్రామర్‌కు టెక్స్ బుక్ లెసెన్ వెనుక ఉన్న థింకింగ్ ఏ బోర్డ్ లాంగ్వేజ్‌లో ఉన్న ప్రతి అంశాన్ని చదివి చెయ్యాలి. దాని నుంచే గ్రామర్ వస్తుంది.

ప్ర-18 రిలేటివ్ క్లాజ్
ప్ర 19 యాక్టివ్, పాసివ్ వాయిస్
ప్ర 20 డైరెక్ట్ - ఇన్‌డైరెక్ట్ స్పీచ్
ప్ర 21 ఫిల్ ఇన్‌ది బ్లాంక్స్
ప్ర 22 ఎడిటింగ్ పాసేజెస్
ప్ర 23 ఆర్టికల్స్
ప్ర 24 యూజ్ ది వర్డ్స్
ప్ర 25 నౌన్ మోడిఫైయర్
ప్ర 26 ఆర్టికల్స్
ప్ర 27 సినోనిమ్స్
ప్ర 28 యాంటోనిమ్స్
ప్ర 29 బ్రాకెట్ టెస్ట్
ప్ర 30 సఫిక్స్ -ప్రిఫిక్స్
ప్ర 31 స్పెల్లింగ్ కరెక్ట్
ప్ర 32 యూజ్ డిక్షనరీ
ప్ర 33 ఫ్రేజెస్ - ఇడియమ్స్
ప్ర 34 మాచ్ ది ఫాలోయింగ్‌లపై ప్రశ్నలు ఇస్తారు.

సెక్షన్-సి 3 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో దానికి 10 మార్కులు చొప్పున 30 మార్కులు ఉంటాయి .ప్రతి ప్రశ్నకు ఛాయిస్ ఉంటుంది. ఛాయిస్ ప్రశ్నలే ఉంటాయి.

35వ ప్రశ్నగా డైరీ ఎంట్రీ లేదా కాన్వర్సేషన్‌లలో ఏదో ఒకటి రాయాలి. 36వ ప్రశ్నగా పర్సనల్ లెటర్ లేదా స్పీచ్‌పై రాయాల్సి ఉంటుంది. 37వ ప్రశలో డబ్ల్యూ హెచ్‌పై 5 ప్రశ్నలు ఉంటాయి. ఒక్కో దానికి 2 మార్కులు చొప్పున 10 మార్కులు. సెక్షన్ సిలో లెటర్ రైటింగ్, డైరీ ఎంట్రీ, ఇన్ఫర్మేషన్ ట్రాన్స్‌ఫర్ ప్రశ్నలు చదువుకోవడం ద్వారా సులువుగా పాస్ మార్కులు సాధించవచ్చు. రైటింగ్ బాగుండాలి. స్పెల్లింగ్ మిస్టేక్స్ రాకుండా చూసుకోవాలి.


సోషల్..నో ఎమోషన్..



సోషల్ స్టడీస్ తేలికగా అనిపించే కష్టమైన సబ్జెక్టు. ఇష్టంతో చదివితే సోషల్ స్టడీస్‌లో మంచి స్కోరింగ్ చేయవచ్చు. టాప్ స్కోర్ సాధించేందుకు ఏఏ అంశాలపై పట్టు సాధించాలని అనే అంశాలను పత్తేపురం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు అప్పారావు తెలియజేశారు.

- సోషల్‌లో 4 సెక్షన్లు ఉంటాయి. సెక్షన్ -1 లో 12 ప్రశ్నలు 1 మార్కులు ప్రశ్నలు వస్తాయి. మొత్తం 12 మార్కులు 1- 12 వరకు ప్రశ్నలలో జాగ్రఫీ -3 హిస్టరీ -3. పోలిటీ-3. ఎకనామిక్స్ -3లలో ప్రశ్నలు వస్తాయి.
- సెక్షన్- 2లో 2 మార్కుల ప్రశ్నలు 8 ప్రశ్నలు వస్తాయి. మొత్తం 16 మార్కులు. 13 -20 ప్రశ్నలలో జాగ్రఫీలో వనరులు అభివృద్ధి, అడవులు, పారిశ్రామిక రంగం, హిస్టరీలో ప్రపంచీకరణ, ఆధునిక ముద్రణా సంస్కృతి, పాలిటీలో సమైఖ్యవాదం, లింగం, మతం, కులం, ఎకనామిక్స్‌లో ప్రపంచీకరణ, భారతీయ ఆర్థిక వ్యవస్థ, వినియోగదారుల హక్కులపై ప్రశ్నలు ఎక్కువగా అడుగుతారు.
- సెక్షన్ -3 లో 4 మార్కులు ప్రశ్నలు 8 వస్తాయి. మొత్తం 32 మార్కులు. 21 నుంచి 28 ప్రశ్నలలో జాగ్రఫీలో అడవులు, వనరులు, ఖనిజాలు, శక్తి వనరులు, హిస్టరీలో ఐరోపాలో జాతీయవాదం, పురోగతి, పారిశ్రామిక యుగం, పాలిటీలో అధికార విభజన, ప్రజాస్వామ్య ఫలితాలు, ఎకనామిక్స్‌లో అభివృద్ధి, వినియోగదారుల హక్కులపై ప్రశ్నలు వస్తాయి.
- సెక్షన్- 4లో 8 మార్కులు ప్రశ్నలు 5 వస్తాయి. మొత్తం 40 మార్కులు. 29 నుంచి 33 వరకు ప్రశ్నలలో జాగ్రఫీలో వనరులు అభివృద్ధి, ఉత్పాదక పరిశ్రమలపై, ఒక మ్యాప్ పాయింటింగ్ ప్రశ్న వస్తుంది. హిస్టరీలో విశ్వవ్యాప్త ప్రపంచం, గ్లోబలైజేషన్‌లపై కరెంట్ ఇష్యూస్ ప్రశ్నలు వస్తాయి. పాలిటీలో రాజకీయ పార్టీలు, అధికారిక విభజన, పాఠ్యాంశాలపై ప్రతి స్పందనలు ప్రశ్నలు ఉంటాయి. ఎకనామిక్స్‌లో భారతీయ ఆర్థిక వ్యవస్థ రంగాలు, ద్రవ్యం పరపతి అంశాలపై సమాచార నైపుణ్యం ప్రశ్నలు వస్తాయి. మ్యాప్ పాయింటింగ్‌పై ఎక్కువ దృష్టి పెట్టాలి. మ్యాప్ పాయింటింగ్ ద్వారా 15 మార్కులను ఈజీగా సంపాదించవచ్చు.

తెలుగు...రాసేద్దాం..బహు సుళువుగా



తెలుగులో మంచిమార్కులు తెచ్చుకునేందుకు ఏఏ అంశాలపై దృష్టి పెట్టాలో ఏలూరు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ ఐ.శ్రీనివాసరావు వివరించారు..

సెక్షన్-01టిలో అవగాహన ప్రతిస్పందన.. మొత్తం 32 మార్కులు.

- **ఎ. ఇందులో పరిచిత ప్రశ్నలు :** (చిన్నపద్యాలు, వాటిలో అంతర్గత ఎంపిక ఉంటాయి. మొదటిపాఠం ప్రత్యక్ష దైవాలు, మూడోపాఠం శతక మాధుర్యం, 9వ పాఠం రాజధర్మం నుంచి పరిచిత పద్యాలు ఇవ్వవచ్చు. వీటిలో ప్రత్యక్షదైవాలు పాఠంలో ముఖ్యమైన పద్యాలైన 'నెమ్మోయి నుత్తమ విజ్ఞానోన్నతి', 'జనని జనకుడు సద్గురు', 'నీవగచి వగచి నిర్భిన్న', 'నీ యద్యయనమ్మును', 'ఇది యట్టిద నీ చెప్పిన'. శతక మాధుర్యం పాఠంలో 'సత్యశీల ధర్మ', 'భూమిలోపల', 'భావమెట్టులుండె', 'మాతృభాషయందు', 'ఇదికాదదియును', రాజధర్మం పాఠంలో 'ఏ పట్టున విసువక', 'ధనముఖ్యము కేవల', 'మెదలనె యొరుదల', 'దేశవైశాల్యా మర్థసిద్ధి', 'హదను వచ్చుదాక', 'హితులు హితాహితులు' వంటి పరిచిత పద్యాలు విద్యార్థులు క్షుణ్ణంగా చదివి అవగాహన చేసుకుంటే ప్రశ్నపత్రంలో పరిచిత ప్రశ్న ఎలా అడిగినా రాయగలరు. మంచిమార్కులు పొందుతారు.
- **బి. పరిచిత గద్యము :** ప్రశ్నలు 8 మార్కులకు ఉంటాయి. ముఖ్యంగా బతుకుగంప, ఉపన్యాస కళ, చేజారిన బాల్యం, జీవనిపాఠాలు బాగా చదివితే ఏదో పాఠం నుంచి పేరా ఇచ్చి, నాలుగు ప్రశ్నలకు జవాబులు రాయమంటారు. విద్యార్థి ఇచ్చిన పేరాను ఒకటికి నాలుగుసార్లు చదివితే జవాబులు ఆ పేరాలోనే ఉంటాయి కాబట్టి సులభంగా 8 మార్కులూ తెచ్చుకోవచ్చు.
- **సి.ఉపవాచక సంఘటనాక్రమం :** ఇక్కడ ఇచ్చిన వాక్యాల యొక్క కాండల పేర్లను గుర్తించి రాయమంటారు.
- **డి.అపరిచిత గద్యం :** ప్రకటన/కరపత్రం/లేఖ వంటి ప్రక్రియల్లో ఏదో ఒకదాని నుంచి 4 ప్రశ్నలు ఇస్తారు. వీటిని కూడా ఒకటికి రెండుసార్లు చదివితే జవాబులు సులభంగా రాయవచ్చు.

సెక్షన్-02టి లో వ్యక్తీకరణ-సృజనాత్మకత 36 మార్కులు.. చిన్నప్రశ్నలు

- **ఎ. కవిపరిచయం :** పద్యభాగం నుంచి ఎఱ్ఱన, ఉమర్ అలీషా, శ్రీకృష్ణదేవరాయలు, ధూర్జటి, వై.సి.వి.రెడ్డి, ఏనుగు లక్షణకవి, గురజాడ అప్పారావు అనే కవులగురించి చదువుకుంటే మంచిమార్కులు పొందగలరు.
- **బి.నేపథ్యం/ప్రక్రియ గద్యభాగం :** కథానిక, వ్యాసం, కథ వంటివి బాగా చదువుకోవాలి. నేపథ్యాలు గద్యభాగ పాఠాలు బతుకుగంప, ఉపన్యాస కళ, చేజారిన బాల్యం, జీవని మొదలైన పాఠాలు చూసుకోవాలి.
- **సి.పాత్ర స్వభావం :** రామాయణం నుంచి దశరథుడు, కైక, భరతుడు, మంథర, మారీచుడు, శూర్పణఖ, సుగ్రీవుడు, విశ్వామిత్రుడు వంటివి బాగా చదువుకోవాలి.
- **డి.పద్యభాగం** నుంచి వ్యాసరూప ప్రశ్నలు రెండు ఇస్తారు. వాటిలో ఒకటి రాయాలి. వీటిలో ముఖ్యంగా ప్రత్యక్షదైవాలు, శతకమాధుర్యం, జలియన్ వాలాబాగ్, ప్రకృతి సందేశం పాఠాలు బాగా చదువుకుంటే ఛాయిస్ పోను బాగా రాయొచ్చు.
- **ఇ.ఉపవాచకం :** వ్యాసరూప ప్రశ్నలు రెండు ఇస్తారు. వాటిలో ఏదోఒకటి రాయాలి. ముఖ్యంగా రామాయణ రచనకు శ్రీకారం చుట్టిన సన్నివేశం లేదా రామాయణ ప్రాశస్త్యం ప్రశ్నలతో పాటు రామసుగ్రీవుల మైత్రి, సీతారాములు వనవాసానికి వెళ్ళడానికి గల కారణాలు వంటి ప్రశ్నలు ఇవ్వడానికి ఎక్కువ అవకాశం ఉంది.
- **ఎఫ్. సృజనాత్మక ప్రశ్నలు :** ఇందులో లేఖ/కరపత్రం/వ్యాసాలకు సంబంధించిన రెండు ప్రశ్నలు ఇస్తారు. వాటిలో ఏదోఒకటి రాయాలి. లేఖ అయితే మిత్రునికి/మిత్రురాలికి లేఖ, కరపత్రం అయితే స్వచ్ఛంద సంస్థల పేర్లతో ఇవ్వడం, వ్యాసం అయితే పరిసరాల పరిశుభ్రత వంటి అంశాలపై ప్రశ్నలు ఇచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. వీటిని విద్యార్థులు జాగ్రత్తగా ఆలోచించి సొంతమాటల్లో రాసి మంచిమార్కులు పొందవచ్చు.
- **జి.భాషాంశాలు :** పదజాలం పేరుతో కొన్ని అర్థాలు, పర్యాయపదాలు, ప్రకృతి వికృతులు, అలంకారాలు వంటివి వ్యాకరణాంశాల పేరుతో వాక్యాలు, జాతీయాలు, ఆధునిక వచనంగా మార్చడం వంటి అంశాల్లో 32 మార్కులకు ప్రశ్నలుంటాయి. ఇవన్నీ తెలుగు వాచకంలోని పాఠాల వెనుక వున్న 378 బిట్స్ నుంచే వస్తాయే తప్ప ఒక్క బిట్‌కూడా బయట నుంచి గానీ, పాఠం లోపలి నుంచి గానీ ఇవ్వరు. విద్యార్థులు ఒక ప్రణాళికాబద్ధంగా ఈ వ్యాకరణాంశాలు, పదజాలం, 378 బిట్స్‌ను క్షుణ్ణంగా చదివితే మంచి మార్కులు పొందవచ్చు. ఇవేగాక అందమైన దస్తూరి పరీక్షలకు ముందునుంచీ ప్రాక్టీస్ చేసి పబ్లిక్ పరీక్షల్లో బాగారాస్తే 98/100 మార్కులు పొందవచ్చు. కొత్త తెలుగువాచకం అనే భయాన్ని వీడి బాగా ప్రిపేర్ అవ్వాలి. శ్రమ మీ ఆయుధమైతే మీకు విజయం బానిస అవుతుంది.

సైన్సా.. గందరగోళం వద్దు





జనరల్ సైన్సులో మొత్తం రెండు పేపర్లు ఉంటాయి. పేపరు-1 ఫిజిక్స్ కెమిస్ట్రీ కలిపి ఉంటుంది. రెండో పేపరు బయోలాజికల్ సైన్సుపై 50 మార్కులకు పేపరు ఉంటుంది. వృక్షశాస్త్రం, జంతుశాస్త్రంపై ప్రశ్నలు ఉంటాయి. నాలుగు సెక్షన్‌లుగా ఉంటాయి. సైన్స్ అంశాలపై భీమవరం పీఎస్ఎం బాలికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు పి.చిట్టికుమారి (ఎన్ఎస్), ఎం.భాగ్యలక్ష్మి, (పీఎస్) వివరించారు.

- సెక్షన్‌లో 1 మార్కుకు సంబంధించి 6 ప్రశ్నలు ఉంటాయి. వీటికి తప్పనిసరిగా పాఠ్యపుస్తకం చదవాలి. ఇందులో పట్టికల నుంచి ఎక్కువగా అడగేందుకు అవకాశం ఉంటుంది. పాఠంలోని అంశాలను కలుపుతూ డయాగ్రంలతో చిన్నగా అడిగే అవకాశం ఉంటుంది.
- సెక్షన్-2లో 4 ప్రశ్నలు ఉంటాయి రెండు మార్కులు ఒక్కొక్కప్రశ్నకు ఇస్తారు. బేధాలు, ప్రశ్నలు అడగటం ప్రయోగాలు పట్టికలు, అప్లికేషన్ నుంచి ఉంటాయి. విద్యార్థులు సులభంగా ఆలోచించి రాసేటట్టుగానే ఉంటాయి. కనీసం నాలుగు పాయింట్లు రాస్తే సరిపోతుంది.
- సెక్షన్-3 లో 5 ప్రశ్నలు ఉంటాయి 4 మార్కులు చొప్పున ఇస్తారు. ఎక్కువగా డయాగ్రాంలపైనే ఉంటాయి, ఇన్‌ఫర్మేటివ్ టేబుల్స్ ఉంటాయి. అన్ని పాఠాల నుంచి భేదాలు రాయాలి. ప్రశ్నకు సూటిగా సమాధానం రాయాలి. దీనిలో 12వ ప్రశ్నకు మాత్రమే ఛాయిస్ ఉంటుంది. దీనిలో ఒక ప్రశ్న వృక్ష శాస్త్రం సంబంధించి మరో ప్రశ్న జంతుశాస్త్రం సంబంధించి ఒకటి ఉంటుంది..
- 4 సెక్షన్‌లో 2 ప్రశ్నలు ఉంటాయి ఒక్కొక్క ప్రశ్నకు 8 మార్కులు ఉంటాయి. ఎక్కువగా యాక్టివేషన్, ఎక్స్ పర్‌మెంటల్ స్థాయిలో ఉంటాయి. మొత్తం 5 పాఠాల నుంచి గమనిస్తే ఈ సెక్షన్‌లో చాలా సులభంగా మార్కులు వస్తాయి. ప్రయోగాలకు అన్ని స్టెప్స్ డయాగ్రమ్‌లు వేస్తే 8 మార్కులు ఖచ్చితంగా వస్తాయి.
- ఫిజిక్స్ మొదటి సెక్షన్‌లో 1 మార్కుకు సంబంధించి 8 ప్రశ్నలు ఉంటాయి. పాఠ్యపుస్తకంలోని 6 పాఠాలకు సంబంధించి చిన్న ప్రశ్నలు ఉంటాయి. పాఠ్యపుస్తకం వెనుకభాగంగాలో వాటిని చదివితే ఎనిమిది మార్కులు సాధించుకోవచ్చు.
- 2వ సెక్షన్‌లో రెండు మార్కులకు సంబంధించి 3 ప్రశ్నలు ఉంటాయి. పాఠ్యాంశంలోని టేబుల్స్ వారీగా, వీటికి సంబంధించి 6 పాఠ్యాంశాల నుంచి ప్రశ్నలు ఉంటాయి. టెక్సు పుస్తకం చదివితే ఈచిన్న ప్రశ్నలకు సమాధానాలు రాయడం చాలా సులభం.
- సెక్షన్ 3లో 4 ప్రశ్నలు ఉంటాయి. ఒక్కొక్క ప్రశ్నకు 3 మార్కులు. టేబుల్స్ ఆధారంగా ఇస్తారు. పాఠ్య పుస్తకంలోని టేబుల్స్‌ను పరిశీలించాలి. ఆఖరున 8 మార్కుల ప్రశ్నలు 3 ఉంటాయి. వీటికి ఆప్షన్ ప్రశ్నలు ఉంటాయి. కొన్ని ఫిజిక్స్ నుంచి మరి కొన్ని కెమిస్ట్రీ నుంచి ఉంటాయి. ప్రతీ ప్రశ్నకు మినిమం ఎనిమిది పాయింట్లు రాస్తే మార్కులు వస్తాయి. ఒక ప్రశ్న ఫిజిక్స్‌లో ఉంటే మరో ప్రశ్న కెమిస్ట్రీ నుంచి ఉంటుంది.



విద్యుద్దీప కాంతుల్లో పాలకొల్లు శంభునిపేట క్రీస్తు లూథరన్ చర్చి

క్రిస్మస్ సంబరాలు

పాలకొల్లు అర్బన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్‌ను పురస్కరించుకుని పాలకొల్లు పట్టణంలో సందడి ప్రారంభమైంది. చాంబర్స్ కళాశాలలో శనివారం క్రిస్మస్ సంబరాలను జరుపుకున్నారు. కళాశాల చైర్మన్ నరసింహరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటేశ్వరరావు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.



పాలకొల్లు చాంబర్స్ కళాశాలలో క్రిస్మస్ తాత వేషధారి సందడి



తణుకు బాలురున్నత పాఠశాలలో శతక పద్య దశ సహస్ర గళార్చనలో పాల్గొన్న విద్యార్థులు

యోగి వేమన పద్య సహస్ర గళార్చన

తణుకు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : చిన్నారుల్లో నైతిక విలువల పెంచి, మాతృభాష పట్ల మమకారం పెంచే ఉద్దేశ్యంతో మాతృభాషా పరిరక్షణ సేవాసమితి నాగ భూషణం హిందీ పండిట్ ఆధ్వర్యంలో శనివారం తణుకు బాలురున్నతలో దశ సహస్ర గళార్చన- వేమన శతకం కార్యక్రమం వైభవంగా జరిగింది. 608 పైగా పాఠశాలల నుంచి 5 వేల మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారు.యోగి వేమన రచించిన 108 పద్యములను చిన్నారులు రాగా యుక్తంగా ఆలపించారు. తెలుగుతల్లి, భరత మాత వేష ధారణలతో చిన్నారులు అలరించారు. రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవ త్సరాలు పూర్తయిన సందర్భంగా చిన్నారులతో లక్ష గళార్చనలో భాగంగా 10 సార్లు జనగణ మన జాతీయ గీతాలాపన కార్యక్రమం నిర్వహించారు.

జాగ్రత్తగా ఉండండి !

సైబర్ నేరాలపై అవగాహన కోసం కాలర్ ట్యూన్



"జాగ్రత్తగా ఉండండి మీకు పోలీసులు, సీబీఐ, కస్టమ్స్, జడ్జిల పేర్లతో తెలియని నెంబర్ల నుంచి వీడియో కాల్స్ చేస్తారు. భయ పడకండి..వారు సైబర్ నేర గాళ్ళు కావచ్చు. ఇలా ఎవరైనా ఫోన్ చేస్తే సైబర్ సెల్ 1930 ద్వారా ఫిర్యాదు చేయండి. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ మీకు తెలియజేస్తుంది. సైబర్ నేరాల బారిన పడకండి.. జాగ్రత్తగా ఉండండి" ఫోన్ చేసిన వెంటనే ఈ కాలర్ ట్యూన్ వస్తోంది. ఇటీవల సైబర్ నేరాలు పెరిగిపోయాయని నేషనల్ క్రైమ్ రికార్డ్సు బ్యూరో వెల్లడించింది. ఈ నేపథ్యంలో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ప్రజలను అప్రమత్తం చేసి అవగాహన కల్పించ డానికి మొబైల్ ఫోన్ టెలికం ఆపరేటర్లకు సూచించింది. కాలర్ ట్యూన్‌గా రోజుకు 8 నుంచి 10 సార్లు ఒకొక్కరు కాల్స్ చేసే సమయంలో దానిని వినిపించాలని సూచించడంతో శనివారం నుంచి దీనిని అమలులోకి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో ఎవరికైనా మొబైల్ నుంచి ఫోన్ చేస్తే ముందు ఈ విధంగా కాలర్ ట్యూన్ వినిపిస్తుంది. ఆ తరువాత రింగ్ వెళ్తుంది.

- ఏలూరు క్రైం

విశ్వాసుల సేవలో బెయెర్షెబా ప్రార్థనా మందిరం

పెదవేగి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పెదవేగి మండలం జగన్నాధపురంలో 2000 వేల సంవత్సరంలో చిన్న కుటీరంలో ఐదుగురితో క్రీస్తు బోధనలు ప్రారంభించిన ఆ బ్రదర్ ఇప్పుడు అదేచోట ఐదువేల మందికి క్రీస్తు బోధనలు వినిపిస్తున్నారు. తాటాకుల కుటీరం స్థానంలో ఐదువేల మంది ఒకేసారి కూర్చుని ప్రసంగాలు వినే సౌకర్యం కలిగిన పెద్ద భవంతి నిర్మాణం జరిగింది. ఏటా నవంబరు చివరివారంలో మూడురోజులపాటు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తుంటారు. బెయెర్షెబా ప్రార్థనా మందిరం ఇప్పుడు ఏలూరు ప్రధాన కేంద్రంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో 40కి పైగా బ్రాంచిలతో క్రీస్తు బోధనలు చేస్తున్నారు బెయెర్షెబా మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు కొయ్యూరు సాల్మన్‌రాజు. క్రిస్మస్ మాసం కావడంతో గ్రామగ్రామాన కూటములు ఏర్పాటు చేస్తూ క్రీస్తు బోధనలు వినిపిస్తున్నారు.

జగన్నాధపురంలోని బెయెర్షెబా ప్రార్థనా మందిరం..



వ్యవస్థాపకుడు బ్రదర్ కె.సాల్మన్‌రాజు



ఆస్తులు.. హక్కులు.. పోరాటాలు

» బజారున పడుతున్న బంధుత్వాలు » శవం తగలడుతున్నా.. శ్మశానంలోనూ సిగపట్లు
» కర్మకాండల ఖర్చులకూ కీచులాటలు » ప్రతి పది కేసుల్లో ఐదు ఆస్తి తగాదాలే
» కోర్టు మెట్లెక్కుతున్న రక్త సంబంధీకులు » సెలబ్రిటీలను వదలని ఆస్తి వివాదాలు



ఆంధ్రజ్యోతి సండే స్పెషల్

పాలకొల్లు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మానవ సంబంధాలు మరుగున పడుతున్నాయి. బంధాలు చివరకు ఆర్థిక సంబంధాలుగానే మిగులుతున్నాయి. తండ్రీకొడుకు, అన్నాతమ్ముడు, అక్కాచెల్లి ఇలా ఏ బంధుత్వమైనా ఆస్తి పంపకం విషయానికొచ్చేటప్పటికి కొట్లాటకు సిద్ధపడుతున్నారు. ఇప్పుడు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పోలీస్ స్టేషన్‌లకు వస్తున్న ప్రతి 10కేసులలో 5కేసులు ఆస్తి తగాదాలతో ముడిపడి ఉంటున్నాయి. నేటి ఆధునిక పోకడలలో మానవ సంబంధాలు మరుగున పడుతూ కేవలం ఆర్థిక సంబంధాలతోనే బంధుత్వాలు మనగలుగుతున్న పరిస్థితుల్లో కుటుంబీకులు మధ్య ఏర్పడుతున్న ఆస్తి తగాదాలపై ఆంధ్ర జ్యోతి అందిస్తున్న ప్రత్యేక కథనం.

ఒకప్పుడు కుటుంబం అంటే కుటుంబ పెద్ద మాటకు విలువ ఉండేది. ఒకే మాటపై కుటుం బం అంతా ముందుకు వెళ్లేది. పండుగలకు, వివాహ శుభకార్యాలకు ఖర్చులు ఆడంబరాలకు కుటుంబ పెద్ద మాటే చెల్లుబాటు అయ్యేది. ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. పెళ్లయిన మూడున్నాళ్లకే దంపతులు కొత్త కాపురం పేరు తో సూక్ష్మ కుటుంబాలకు తెరతీస్తున్నారు. ఇక్కడే ఆస్తి తగాదాలు మొదలవుతున్నాయి. జన్మనిచ్చి న తల్లిదండ్రుల మాటను లెక్క చేయకుండా ఆస్తి పంపకాలకై తనయులు ఘర్షణలకు దిగు తున్నారు. ఇటీవల జిల్లాలో పలు సంఘటలను వెలుగుచూస్తున్నాయి. ఆస్తి తమ హక్కుగా బావిస్తున్న వారసులు కుటుంబ పెద్దలను హీనంగా చూస్తున్నారు. ఆస్తి ఇస్తేనే తమను కన్నందుకు విలువ ఉంటుందనే విపరీత అర్థాల తో కుటుంబ పెద్దల మనసును గాయపరిస్తు న్నారు. సామాన్య కుటుంబాలలో ఆస్తి తగాదా లు తక్కువుగా ఉన్నప్పటికీ దిగువ, మధ్యత రగతి, ఎగువ మధ్యతరగతి, కుటుంబాలలో ఆస్తి పంపకాలపై పలు కుటుంబాలు రోడ్డున పడు తున్నాయి.

• విశేషం ఏమిటంటే వందల, వేల కోట్లు కూడబెట్టిన సెలబ్రెటీ, రాజకీయ కుటుంబాల లోనూ ఆస్తి తగాదాలు వెలుగు చూస్తున్నాయి. వీరికి ఉదాహరణ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, ఆస్తి తాగాదాలో తనకు అన్యాయం చేశాడంటూ సొంత సోదరి షర్మిల రోడ్డెక్కడం అందరికీ తెలిసిన విషయమే.

• ఎన్నో సందేశాత్మక చలన చిత్రాలతో వెండి తెరపై వెలుగు వెలిగిన సినీనటులు మోహన్ బాబు కుటుంబంలోనూ ఆస్తి తగాదాలు రచ్చగా మిగిలాయి. కొన్ని వెలుగు చూస్తుంటూ ఇంకా బయట పడకుండానే కోర్టులు వరకూ వెళ్తన్నాయి.

• ఇటీవల పాలకొల్లు పట్టణంలో ఆస్తి తగాదాలతో సోదరులు ఘర్షణ పడగా కేసు చివరకు పోలీస్ స్టేషన్‌కు కోర్టుకు వెళ్లింది.

• మరో సంఘటనలో తండ్రి మృతదేహం శ్మశానికి వెళ్లకుండానే ఆస్తి పంపకాలకు వారసులు సిగపట్టు పట్టారు. కర్మ కాండల ఖర్చుకు కీచులాడుకున్నారు. బాధ్యతలు మరిచి కేవలం హక్కులకై పోరాడుతూ కుటుంబ బాంధవ్యాలను చులకన చేస్తున్నారు.

• తగిన పత్రాలు లేకుండా తల్లీ లేదా తండ్రి మృతి చెందితే ఆయా కుటుంబాలలో ఆస్తి పంపకాలకు ప్రాణాలు సైతం లెక్క చేయకుండా పోరాడుతున్నారు. ఇటీవల జిల్లాకు చెందిన ఒక పౌరుడు తమ తండ్రి మరణవార్త విని దుబాయి నుంచి జిల్లాకు వచ్చాడు. తండ్రి కర్మ కాండలు అనంతరం కుటుం బ సభ్యులు ఆస్తి చిట్టాలను విప్పారు. పెద్ద చదువు చదివి దుబాయిలో ఉద్యోగం చేసుకు ంటున్నావు కాబట్టి నీకు ఆస్తిలో వాటా రాద ంటూ తమ్ముడు చెల్లెళ్లు వాదానికి దిగారు. ఇంటి పట్టునే ఉండి పంట మీద వచ్చే ఆదాయం అంతా మీరే తిన్నారు కాబట్టి ఆస్తి నాకే దక్కాలంటూ అన్నయ్య పోరాటం ఇలా వాళ్ల మధ్య ఆస్తి వివాదం ముదిరి పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కారు.

• మరో సంఘటనలో తల్లి వద్ద ఉన్న మొ త్తం సొమ్ము ఆస్తి గుంజేసిన కొడుకు కూతురు తల్లిని వృద్ధాశ్రమంలో వదిలేశారు. ఇలా అనేక సంఘటనలు వాయువరుసలు మరిచి కేవలం తమ పెద్దలు సంపాదించిన ఆస్తినే ప్రధానంగా బావిస్తూ తగాదాలు పడుతున్నారు.

• ఇటీవల లోక్ అదాలత్‌లలో రాజీ అవుతున్న కేసులలో అనేకం ఆస్తి తగాదాలకు సంబందించిన కేసులే ఉంటున్నాయనీ న్యాయ నిపుణులు చెబుతున్నారు.

సూక్ష్మ కుటుంబాలతో ఆర్థిక అవసరాలు పెరిగి తల్లిదండ్రి, అన్నా తమ్ముడు, అనే బంధుత్వం సైతం కాలరాచి ఆస్తులకై వీధిపోరాటాలు చేస్తున్నారనీ మానసిక అధ్యయన నిపుణులు చెబుతున్నారు. తల్లిదండ్రులు నుంచి వచ్చే సాంక్రమిక ఆస్తులు పంపకం విషయం కుటుంబ సభ్యులంతా సామరస్య వాతావరణంలో పరిష్కరించుకోవడం ద్వారానే తగాదాలు తగ్గుతాయని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. మొత్తంగా మానవ సంబంధాలు మరుగున పడి కేవలం ఆర్థిక సంబంధాలే బలపడుతున్న పరిస్థితుల్లో కుటుంబీకుల మధ్య ఏర్పడుతున్న ఆస్తి తగాదాలు ఆందోళన కల్గిస్తున్నాయని పరిష్కార మార్గంలో ఆయా కుటుంబాలు వ్యవహరించకుంటే సంబంధాలు మరింత దిగజారతాయని సామాజికి అధ్యయన నిపుణులు హెచ్చరిస్తున్నారు.

బాల్యం నుంచి నైతిక విలువలు నేర్పాలి



చిన్నతనం నుంచి పిల్లల్లో నైతిక విలువలు పెంపొందించడం ద్వారా పెద్ద అయ్యాక గొడవలు పడకుండా ఉంటారు. నేటి యాంత్రిక జీవనంలో వ్యక్తిగత స్వార్థం పెరగడం వల్లనే కుటుంబాలలో ఆస్థి తగాదాలు వస్తున్నాయి. పెళ్ళి అయ్యాక మరింత స్వార్థపరులుగా మారుతున్నారు. తల్లిదండ్రులు పిల్లలకు ఆర్థిక బంధాల కంటే మానవ సంబంధాలే గొప్పవని, చిరుప్రాయం నుంచి పదే పదే చెబుతూండాలి. ఆస్తి తగాదాలకు కారణం ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నం కావడం అని చెప్పవచ్చు, తోడబుట్టిన వారి మధ్య ప్రేమానుబంధాలు బలపడేలా చూసే బాధ్యత తల్లింద్రులదే. క్రమ శిక్షణ అనేది ముఖ్యం. పౌరుల్లో భౌతిక వాదం తగ్గడానికి చిన్నతనం నుంచి పునాదులు వేయాలి. లేదంటే బంధుత్వాలు బీటలు వారి, డబ్బే ముఖ్యం అన్న రీతిలో మారుతారు.

డాక్టర్ చల్లా భారతి, మానసిక వైద్య నిపుణురాలు, పాలకొల్లు

బెడిసికొట్టిన వైసీపీ వ్యూహం

45 నిమిషాల్లో ముగిసిన ప్రత్యేక సమావేశం

జడ్పీ చైర్ పర్సన్‌పై అనర్హత వేటు వేయాలని వైసీపీ జడ్పీటీసీ సభ్యుల వినతి





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రి సెల్వి.. పాల్గొన్న ఎమ్మెల్యేలు

ఏలూరుసిటీ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమగోదావరి జడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీపై అనర్హత వేటు వేయాలని వైసీపీ జడ్పీటీసీలు పన్నిన వ్యూహం బెడిసి కొట్టింది. శనివారం ఏలూరు జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన పత్ర్యేక సమావేశంలో సుదీర్ఘంగా చర్చ జరుగుతుందని , వాడివేడిగా చర్చ జరుగుతుందని అందరూ ఊహించారు. కాని 45 నిమిషాల్లోనే స్వల్ప చర్చలతో ఈ సమావేశం ముగియటం సర్వత్రా చర్చనీయాంశమైంది. గత నెల 11వ తేదీన జడ్పీ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఎన్నికల కోడ్ కారణంగా రద్దు చేయటంతో మళ్ళీ సమావేశం నిర్వహించాలని వైసీపీ జడ్పీటీసీ సభ్యులు జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చి కోరటం జరిగింది. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత జడ్పీటీసీ సభ్యులకు ముందుగానే తెలియజేసి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తారని అప్పట్లో జిల్లా కలెక్టర్ వైసీపీ జడ్పీటీసీ సభ్యులకు తెలియజేశారు. దీంతో ఈనెల 21వ తేదీ జడ్పీ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. కాని వైసీపీ జడ్పీటీసీ సభ్యులు అనుకున్న విధంగా ఈ సమావేశంలో వాడివేడి చర్చ జరగకపోవటం గమనార్హం. ఈ సమావేశంలో మెజార్టీ వైసీపీ జడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నా వారి వ్యూహం ఫలించలేదని చెబుతున్నారు. ఇక ఈ జడ్పీ ప్రత్యేక సమావేశంలో 38 జడ్పీటీసీ సభ్యులు పాల్గొన్నా ముగ్గురు వైసీపీ జడ్పీటీసీ సభ్యులు మాత్రమే చర్చలో పాల్గొనటం జరిగింది. పెదవేగి, పాలకొల్లు, పోడూరు జడ్పీటీసీ సభ్యులు విజయబాబు, గోవిందరాజులు, పెద్దిరాజులు ఈ సమావేశంలో జరిగిన చర్చలో పాల్గొని వైసీపీ గుర్తుపై గెలిచి టీడీపీలోకి వెళ్ళి పోయిన జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీపై పంచాయతీ రాజ్ చట్టం కింద అనర్హత వేటు వేయాలని కోరారు. అయితే ఈ విషయంపై ఇన్‌చార్జి జడ్పీ సీఈవో, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు సమాధానమిస్తూ అసెంబ్లీ, పార్లమెంటు సభ్యులకు మాత్రమే పార్టీ ఫిరాయింపుల చట్టం వర్తిస్తుందని, స్థానిక సంస్థల సభ్యులకు ఈ చట్టం వర్తించదని పేర్కొన్నారు. అలాగే ఒక సభ్యుడు ఎన్నికైన నాలుగు సంవత్సరాల వరకు అవిశ్వాస తీర్మానం పెట్టటానికి అవకాశం లేదని చెప్పారు. అయితే సభలో ఓటింగ్‌కు అనుమతించాలని, మినిట్స్ ను తమకు ఇవ్వాలని వైసీపీ జడ్పీటీసీ సభ్యులు పట్టుబట్టారు. ఈ విషయంపై జడ్పీ ఇన్‌చార్జి సీఈవో విజయరాజు సమాధానమిస్తూ అవిశ్వాస తీర్మానం లేనప్పుడు ఓటింగ్‌కు అవకాశం ఉండదని, మినిట్స్ కావాలంటే ఇస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ వంకా రవీంద్రతో పాటు వీరవాసరం జడ్పీటీసీ సభ్యుడు జయప్రకాష్‌నాయుడు తమ అభిప్రాయాలను వెల్లడించారు.

ప్రతి మండలాన్ని అభివృద్ధి చేస్తా: జడ్పీ చైర్మన్

జిల్లాలో ఏ జడ్పీటీసీ సభ్యునికి అన్యాయం జరగకుండా పనిచేస్తానని, ప్రతి మండలాన్ని అభివృద్ధి చేస్తానని జడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ ప్రత్యేక సమావేశం అనంతరం పాత్రికేయుల సమావేశంలో చెప్పారు. వైసీపీ నుంచి గెలిచాను కాబట్టి తనను రాజీనామా చేయాలని వైసీపీ జడ్పీటీసీ సభ్యులు అంటున్నారని, పంచాయతీరాజ్ చట్టం ప్రకారం తాను పనిచేస్తానని, ఆ చట్ట ప్రకారం నాకు ఇంకా సంవత్సరన్నర పదవీకాలం ఉందని చెప్పారు. అలాగే ఎన్నికలలో ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చామని, వాటిని నెరవేర్చటానికి పార్టీ మారవలసి వచ్చిందన్నారు.

సాదాసీదాగా జడ్పీ సమావేశం

ఏలూరుసిటీ, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజా పరిసత్ సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. జడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పద్మశ్రీ మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో విద్యాప్రమాణాలు స్థాయి పెంచే విధంగా విద్యాశాఖాధికారులు కృషి చేయాలని కోరారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఉత్తీర్ణతా ఫలితాలు సాధించేలా ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు విద్యాబోధన చేయాలన్నారు. మాతా శిశు మరణాలు సంభవించకుండా పటిష్ఠమైన చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ శాఖల అధికారులు తమ శాఖ లక్ష్యాలను నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ కె వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు తెలియజేసిన సమస్యలపై అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎమ్మెల్సీ గోపిమూర్తి మాట్లాడుతూ గత ప్రభుత్వం 117 జీవోను అమలు చేసి ఉపాధ్యాయుల సంఖ్యను కుదించారని, మిగిలిన ఉపాధ్యాయులపై అదనపు భారం పడిందన్నారు. ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు బడేటి రాధాకృష్ణయ్య(చంటి), పత్సమట్ల ధర్మరాజు, సొంగా రోషన్‌కుమార్, జిల్లా పరిషత్ ఇంచార్జ్ సీఈవో ఆర్ విజయరాజు పాల్గొన్నారు.

వలంటీర్ల వ్యవస్థను కొనసాగించాలంటూ ధర్నా

ఏలూరు రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామ, వార్డు సచివాలయ వలంటీర్ల వ్యవస్థను కొనసాగించాలని కోరుతూ ఏపీ గ్రామ, వార్డు వలంటీర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. సీఐటీయూ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి ధర్నా నిర్వహించారు. కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు మాట్లాడుతూ ఎన్నికల ముందు వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామని రూ.5వేల నుంచి రూ.10వేలకు జీతం పెంచుతామని చంద్రబాబు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ప్రభుత్వం వచ్చి ఆరునెలలు దాటినా వలంటీర్ల వ్యవస్థపై నేటి వరకు నిర్ణయం తీసుకోకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో ఏలూరు నగర అధ్యక్షుడిగా కె.పృథ్వీరాజ్, కార్యదర్శిగా బి.బెహరా, మరో 11మందితో కమిటీని ఏర్పాటు చేశారు.

కొత్త చట్టాలపై నైపుణ్యం పెంచుకోవాలి

జిల్లా జడ్జి సి.పురుషోత్తమ కుమార్



ఏలూరు క్రైం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎప్పటి కప్పుడు మారుతున్న చట్టాలపై న్యాయమూర్తులు మరింత నైపుణ్యాన్ని పెంపొందించుకోవడానికి శిక్షణ తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి పురుషోత్తమ కుమార్ అన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని న్యాయమూర్తులకు ఏలూరు జిల్లా కోర్టులో శిక్షణ తరగతులను శనివారం నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి పురుషోత్తమకుమార్ అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్స్‌గా పాల్గొన్న హైదరాబాద్ ఏపీ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ వైస్ చైర్మన్ (రిటైర్డ్) వైవీ రామకృష్ణ, విజయవాడ రిటైర్డ్ డిస్ట్రిక్ట్ జడ్జి జీవీ కృష్ణయ్య, తెలంగాణా హైకోర్టు అడ్వకేట్ ఏపీ సురేష్, ఏలూరు జిల్లా 8వ జిల్లా జడ్జి సునీల్‌కుమార్‌లు వ్యవహరించారు.

హైందవ శంఖారావం జయప్రదం చేయాలి



శంఖారావం ప్రచారం నిర్వహిస్తున్న వీహెచ్‌పీ మహిళలు

పాలకొల్లు అర్బన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): హిందూ దేవాలయాలకు స్వయం ప్రతిపత్తి రక్షణ, సమాజం సంరక్షణకు వీహెచ్‌పీ ఆధ్వర్యంలో జనవరి 5వ తేదీన జరిగే హైందవ శంఖారావం బహిరంగ సభను విజయవంతం చేయాలని వీహెచ్‌పీ మహిళ నాయకులు ప్రచారం నిర్వహిస్తున్నారు. కేసవరం (గన్నవరం విమానాశ్రయం సమీపంలో) జరిగే భారీ బహిరంగ సభకు వేలాది మందిగా విచ్చేసి విజయవంతం చేయాలని కోరుతున్నారు. జిల్లా కార్యదర్శి తొట్టెంపూడి సునీత ఆధ్వర్యంలో మహిళలు ప్రచార కార్యక్రమం నిర్వహించారు. నరసింహరాజు, బొడా సత్యజిత్ కుమార్, చెరుకూరి శ్రీనివాసరావు తదితరులు శంఖారావం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈసభకు వచ్చేవారు విజయవాడ వెళ్లడానికి 5వ తేదీ ఉదయం 6గంటలకు స్థానిక గాంధీ బొమ్మల సెంటర్ నుంచి బస్సులు ఏర్పాటు చేసినట్టు వారు తెలిపారు.

క్రైమ్ కార్నర్

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి మృతి

తణుకు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. శనివారం జాతీయ రహదారి డీమార్టు సమీపంలో తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో పెరవలి మండలం అన్నవరప్పాడు గ్రామానికి చెందిన కూరగాయల వ్యాపారి అడ్డగర్ల సుబ్రహ్మణ్యం(45) మోటారు సైకిల్‌పై వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈప్రమాదంలో మృతదేహం నుజ్జుఅయ్యింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా తణుకు రైల్వే స్టేషన్ సమీపంలో రైలు నుంచి జారిపడి వృద్ధురాలు మృతి చెందింది. సుమారు 70సంవత్సరాలు వయస్సు ఉండి, రైలు పట్టాల సమీపంలో పడి ఉన్నట్లు స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. భీమవరం రైల్వే ఎస్ఐ 70939 39777కు వివరాలు అందించాలని కోరారు.

క్లీనర్ అనుమానాస్పద మృతి



ఏలూరు క్రైం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మద్యానికి బానిసై అనారోగ్యంపాలై రోడ్డుపైపడి ఒక వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటనపై పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దెందులూరు మండలం పోతునూరు గ్రామానికి చెందిన వల్లభనేని రాఘవేంద్రరావు (50)కి వివాహం కాలేదు. లారీ క్లీనర్‌గా పనిచేస్తూ జీవిస్తున్నాడు. మద్యానికి బానిస అయిన అతను పక్షవాతానికి గురయ్యాడు. ఏలూరు పాతబస్టాండ్ సమీపంలో లలితా లాడ్జిలో ఉంటూ చికిత్స పొందుతున్నాడు. అతనిని తిరిగి ఆసుపత్రికి శుక్రవారం అర్ధరాత్రి లాడ్జి సిబ్బంది తీసుకువెళ్తుండగా మృతి చెందాడు. ఈ సమాచారం ఏలూరు టూటౌన్ పోలీసులకు అందించడంతో టూటౌన్ సీఐ వైవి రమణ ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ వ్యర్థాల వాహనాలు పట్టివేత

పెదపాడు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : చేపల చెరువుల్లో మేతగా వేసేందుకు చికెన్ వ్యర్థాలను తరలిస్తుండగా పలుచోట్ల సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించి ఐదు ఐషర్ వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లుగా పెదపాడు ఎస్సై కట్టా శారద సతీష్ తెలిపారు. చికెన్ వ్యర్థాలను గొయ్యి తీసి పూడ్చి పెట్టించినట్లుగా చెప్పారు. వాహన యజమాని, డ్రైవర్లపై పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సారాపై కేసు నమోదు

చింతలపూడి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఎక్సైజ్ దాడులు నిర్వహించారు. వెలగపాడు గ్రామంలో 600 లీటర్ల బెల్లపు ఊటను కనుగొని ధ్వంసం చేశారు. వేపుగుంటలో టి.వెంకటేశ్వరరావును అరెస్టు చేశారు. నాగిరెడ్డిగూడెంలో బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు సీఐ అశోక్ తెలిపారు.

వాహన దొంగలు దొరికారు..

27 ద్విచక్ర వాహనాలు, ఐదున్నర కాసుల బంగారం స్వాధీనం.. ఇద్దరి అరెస్టు



స్వాధీనం చేసుకున్న బైక్‌లను పరిశీలిస్తున్న ఎస్పీ అస్మి

భీమవరం క్రైం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వారిద్దరిదీ ఒకే ఊరు. ఇద్దరూ స్నేహితులు. ఇద్దరూ కలసి కొంత కాలం క్రితం హైదరాబాద్ వెళ్ళి అక్కడ ర్యాపిడో, స్విగ్గీలో పని చేశారు. అక్కడ చెడు వ్యసనాలకు బానిసలయ్యారు. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో వారి స్వగ్రామమైన పోడూరు మండలం కవిటం వచ్చారు. చెడు వ్యసనాలకు బానిసలు అయిన వారికి డబ్బు అవసరం వచ్చింది. దీంతో సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఒంటరి మహిళల మెడలో నుంచి బంగారు వస్తువులు, ద్విచక్ర వాహనాలు దొంగతనాలు చేయడం ప్రారంభించారు. అలా పాలకొల్లు, యలమంచిలి, పోడూరు, వీరవాసరం, పాలకోడేరు, భీమవరంలో 30 కేసులు వారిపై ఉన్నాయి. ఈ నెల 14వ తేదీన వీరవాసరం మండలంలో ఒక మహిళ మెడలో బంగారం దొంగతనం చెయ్యడంతో ఆ కేసులో వీరవాసరం పోలీసులు అరెస్ట్ చేశారు. దీనికి సంబంధించి వీరవాసరం పోలీస్ స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి వివరాలు వెల్లడించారు. పోడూరు మండలం కవిటం గ్రామానికి చెందిన కాలా రమేష్‌బాబు, కడలి బాబిలు కలసి ద్విచక్ర వాహనంపై ఈ నెల 14వ తేదీన వీరవాసరం మండలం మడుగు పోలవరం లంక గ్రామం వెళ్ళి ఏదైనా దొంగతనం చెయ్యాలని చూడగా సుమారు 70 సంవత్సరాలు ఉన్న ఒక వృద్ధురాలు నడుచుకుంటూ వెళ్ళడాన్ని చూసి ఆమె మెడలో ఉన్న గొలుసు లాక్కుని పరారయ్యారు. దీనిపై వారు 15వ తేదీన వీరవాసరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం బుధారాయుడు చెరువు గ్రామం వద్ద వారిని అరెస్ట్ చేయడం జరిగిందని తెలిపారు.

స్వాధీనం చేసుకున్న సొత్తు ఇదే

కాలా రమేష్‌బాబు, కడలి బాబులను అరెస్ట్ చేసిన అనంతరం దర్యాప్తు చేశారు. వారి వద్ద వీరవాసరం పోలీస్ స్టేషన్ పరిధిలో 3 కాసులు బంగారు ఆభరణాలు (ఒక లక్షా ఎనభై వేలు రూపాయలు), పాలకొల్లు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో రెండున్నర కాసుల బంగారు గొలుసు స్వాధీనం చేసుకున్నారు. వాటితోపాటుగా యలమంచిలి, వీరవాసరం, పాలకొల్లు రూరల్, పోడూరు, పాలకోడేరు, భీమవరం రూరల్, వీరవాసరం పోలీస్ స్టేషన్ పరిధిలోని 27 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పి తెలిపారు. ఈ సమావేశంలో భీమవరం డిఎస్‌పి ఆర్‌జి జయసూర్య, భీమవరం రూరల్ సీఐ శ్రీనివాస్, వీరవాసరం ఎస్ఐ రాజ్‌కుమార్, స్టేషన్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

హత్య కేసు నిందితుడి అరెస్టు



నిందితుడిని అరెస్టు చేసి కేసు వివరాలు చెబుతున్న డీఎస్పీ శ్రావణ్ కుమార్

ఏలూరు క్రైం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు జూట్‌మిల్లు సమీపంలోని ఓవర్ బ్రిడ్జి కింద ఈనెల 14వ తేదీ తెల్లవారుజామున షేక్ వెంకట కనకరాజును హత్య చేసిన హంతకుడిని అరెస్టు చేశామని డీఎస్పీ డి శ్రావణ్‌కుమార్ చెప్పారు. ఏలూరు డీఎస్పీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ కేసు వివరాలను డీఎస్పీ వెల్లడించారు. జూట్ మిల్లు ఓవర్ బ్రిడ్జి కింద 39వ పిల్లర్ వద్ద షేక్ వెంకట కనకరాజు (41) అనే ఆటో డ్రైవర్ తన కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. అతని భార్య మరణించడంతో ముగ్గురు కుమార్తెలతో నివాసం ఉంటున్నాడు. ఏలూరు రూరల్ మండలం వెంకటాపురం పంచాయతీ సాయినగర్‌కు చెందిన మామిడి నాని (23) అనే యువకుడు ప్రైవేటు ట్రావెల్ బస్సులో క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. ఓవర్ బ్రిడ్జి కింద వెళ్ళేటప్పుడు కనకరాజు పెద్దకుమార్తెను చూసి నిత్యం వేధించేవాడు. అతనికి కనకరాజు హెచ్చరిక చేసినప్పటికీ అతను వేధింపులు కొనసాగించాడు. దీంతో తన పిల్లలను కాపాడుకోవడానికి ఏలూరును విడిచి ఉంగుటూరు మండలం నారాయణపురం గ్రామానికి వెళ్ళాడు. అక్కడే నివాసం ఉంటూ తాపీ పనులు చేస్తూ తన ముగ్గురు కుమార్తెలను పోషించుకుంటున్నాడు. ఈనెల 13వ తేదీన ఏలూరునకు పనిమీద వచ్చి ఆ పిల్లర్ వద్ద నివాసం ఉండే లక్ష్మి ఇంటి ఆవరణలో పడుకున్నాడు. కనకరాజు వచ్చిన సంగతి తెలుసుకున్న నాని అతనిని హత్య చేస్తే అతని కుమార్తెను పెళ్ళి చేసుకోవచ్చునని భావించి పదునైన (సూదిగా ఉన్న) చెక్కతో చిత్రహింసలు పెట్టి హతమార్చి వెళ్ళిపోయాడు. ఈ సంఘటనపై ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో త్రి టౌన్ సీఐ ఎస్ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని అరెస్టు కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ బృందం గాలింపు చేపట్టింది. హంతకుడు మామిడి నాని విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో ఉన్నట్లు గురించి శనివారం ఉదయం అతనిని అరెస్టు చేసి ఏలూరుకు తీసుకువచ్చినట్లు చెప్పారు. నాని గతంలో ఒక హత్య కేసులో ఉన్నాడని మరో హత్యాయత్నం కేసు కూడా ఉందని ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీట్ కూడా ఉందని చెప్పారు.

రాయలం పంచాయతీలో అవకతవకలు

ముగ్గురిపై కేసు

భీమవరం క్రైం, డిసెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): భీమవరం మండలం రాయలం గ్రామ పంచాయతీలో గతంలో పనిచేసిన అధికారులు పంచాయతీ సొమ్ము దుర్వినియోగం చేశారంటూ ముగ్గురిపై కేసు నమోదయ్యింది. భీమవరం టూటౌన్ ఎస్ఐ రెహ్మాన్ తెలిపిన వివరాల ప్రకారం గతంలో రాయలం పంచాయతీ సెక్రటరీలుగా పనిచేసిన ఎస్‌కెజి.కృష్ణంరాజు, డి.జయరాజు, జూనియర్ అసిస్టెంట్ సీహెచ్.సుమనాగు పంచాయతీ సొమ్ము దుర్వినియోగం చేశారంటూ ఫిర్యాదులు రావడంతో అధికారులు విచారణ జరిపారు. రెండు కోట్ల ముప్పై లక్షలు దుర్వినియోగం జరిగినట్లుగా నిర్ధారణ కావడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాలతో తహసీల్దార్ రావి రాంబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కృష్ణంరాజు, జయరాజు, సుమనాగులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రెహ్మాన్ తెలిపారు.

రూ.62 లక్షల ప్రభుత్వ నిధుల దుర్వినియోగం

జూనియర్ అసిస్టెంట్ మురళీ అరెస్టు



పోలీసులు అరెస్టుచేసిన కుంచె మురళీ వెంకట తులసీధర్

భీమవరం టౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ నిధులు దుర్వినియోగానికి పాల్పడితే క్రిమినల్ చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి హెచ్చరించారు. పాలకొల్లు ఏరియా హాస్పిటల్లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కుంచె మురళి వెంకట తులసీధర్ (26)ను ప్రభుత్వ నిధులు దుర్వినియోగం, చెక్కుల ఫోర్జరీ కేసులో అరెస్టుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. శనివారం కుంచె మురళి వెంకట తులసీదర్‌ను పాలకొల్లు సీఐ కె.రజనీ కుమార్ ఆధ్వర్యంలో ఎల్.ఆర్ పేట ఇంటి వద్ద శనివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు స్పష్టం చేశారు. పాలకొల్లు ఏరియా హాస్పటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఓ.రవికుమార్ లిఖితపూర్వక ఫిర్యాదు మేరకు దర్యాప్తు నిర్వహించి సుమారు రూ. 62లక్షల వరకు నిధులను దుర్వినియోగం చేసినట్లు దర్యాప్తులో వెల్లడైందని తెలిపారు. ఇతను ప్రస్తుతం జూనియర్ అసిస్టెంట్‌గా పాలకొల్లు ఏరియా హాస్పిటల్ లో పని చేస్తూ హాస్పటల్‌కు సంబంధించిన మూడు అకౌంట్స్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పేషెంట్ కేర్ అకౌంట్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ డెవలప్‌మెంట్ సొసైటీ అకౌంట్, పి.ఎఫ్.ఎం.ఎస్ అకౌంట్‌లు ఇతను జులై 2024 నుంచి ఇప్పటి వరకు నిర్వహిస్తున్నాడు. మూడు అకౌంట్ లకు సంబంధించిన లావాదేవీల విషయంలో నిధులు దుర్వినియోగం బయటపడిందని తెలిపారు. మూడు అకౌంట్‌ల ద్వారా సుమారు 62 లక్షల రూపాయలు సంతకాలు ఫోర్జరీ చేసి డ్రా చేసి వాడుకున్నాడని విచారణలో తేలిందని తెలిపారు.

రూ. 97 కోట్లతో రహదారుల అభివృద్ధి : ఎంపీ మహేష్‌కుమార్

ఏలూరు టూ టౌన్, డిసెంబరు 21 (ఆంధ్ర జ్యోతి): జిల్లాలో రహదారుల నిర్మాణం, విస్తరణకు రూ. 97 కోట్ల రూపాయలు మంజూరు చేసినట్లు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ఏడు నియోజక వర్గాల పరిధిలో 13 రహదారుల మరమ్మతులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు ఎంపీగా గెలిచిన మరుక్షణమే జిల్లాలోని రహదారుల దుస్థితిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్ళామన్నారు. దాని ఫలితంగానే రూ. 97 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు.

సంక్రాంతిలోగా గుంతలు లేని రహదారులు

ఏలూరు టూ టౌన్, డిసెంబరు 21 (ఆంధ్ర జ్యోతి): గత ఐదేళ్ళ వైసీపీ పాలనలో ప్రధాన రహదారులన్నీ ఛిద్రమైపోయాయని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఆర్‌ఆర్ పేటలో నూతన రహదారి నిర్మాణ పనులను శనివారం ఎమ్మెల్యే చంటి ప్రారంభించారు. సంక్రాంతి పండుగ లోపు గుంతలు లేని రోడ్లుగా తయారు చేస్తామన్నారు. మేయర్ షేక్ నూర్జహాన్, కమిషనర్ భాను ప్రతాప్, ఎస్ఈ తదితరులు పాల్గొన్నారు.

అందరికీ ఆదర్శం నేతాజీ : రోషన్

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 21 (ఆంధ్ర జ్యోతి): స్థానిక బోసుబొమ్మ సెంటర్ వద్ద నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ శనివారం పునః ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెల్లదొరల గుండెల్లో రైళ్ళు పరుగెత్తించిన వీరుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అందరికీ ఆదర్శమన్నారు. అటువంటి గొప్ప వ్యక్తిని భారతీయులంతా గుర్తుంచుకోవాలన్నారు. అనంతరం బోసుబొమ్మ సెంటర్లో బోస్ విగ్రహం ఉన్నరేకుల షెడ్డు ప్రదేశాన్ని హమాలీలు విశ్రాంతి తీసుకునే నిమిత్తం వారికి అప్పగించారు.

విద్యార్థులు పథకాలను వినియోగించుకోవాలి: గన్ని

భీమడోలు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పథకాలను సద్వినియోగపర్చుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలని మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు అన్నారు. గుండుగొలను నెంబర్ 2 మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన సరస్వతీ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు.

ప్రత్యేక తరగతుల విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలి

ఏలూరు అర్బన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మార్చి పదో తేదీ వరకు ఆదివారం, రెండో శనివారాలు, పండుగ రోజులతో సహా నిర్వహిస్తున్న వందరోజుల కార్యాచరణ ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న విద్యార్థులకు సెలవు దినాల్లో సైతం మధ్యాహ్న భోజనపథకం, ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఉత్తర్వులు జారీచేయాలని ఏపీటీఎఫ్-1938 జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రత్నంబాబు, మోహన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం డీఈవో వెంకటలక్ష్మమ్మకు వినతిపత్రం అందజేశారు. ఈ నెల 26 నుంచి టీచర్లకు నిర్వహించ తలపెట్టిన ఎఫ్ఎల్ఎన్ శిక్షణ తరగతులను క్రిస్మస్ సెలవుల దృష్ట్యా క్రిస్టియన్ మైనార్టీ పాఠశాలల ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. అలాగే బాక్సింగ్ డే సందర్భాన్ని పురస్కరించుకుని ఈ నెల 26న ప్రభుత్వ పాఠశాలలకు లోకల్ హాలిడేగా ప్రకటించుకునే వెసులుబాటు ఇవ్వాలని డీఈవోకు పీఆర్టీయూ జిల్లా నాయకులు ఆంజనేయులు, రాంబాబు, కాంతారావు, ఆదినారాయణ వినతిపత్రాన్ని అందజేశారు.

యోగాపై విద్యార్థులకు శిక్షణ

చింతలపూడి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ప్రగడవరం, చింతలపూడి గ్రామాల్లో విద్యార్థులకు యోగా శిక్షణపై తరగతులు నిర్వహించారు. ప్రగడవరంలో ది ఆర్ట్ ఆఫ్ లివింగ్ నిర్వాహకులు చిక్కాల సుధాకర్, కుసుమకుమారి విద్యార్థులకు యోగా శిక్షణ ఇచ్చారు. ధ్యానం వల్ల ఆరోగ్యం, మెదడు చురుగ్గా ఉంటాయన్నారు. చింతలపూడి మేడబడిలో మానవత ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగా శిక్షణను నిర్వాహకులు ఆర్నేపల్లి అప్పారావు నిర్వహించారు. హెచ్ఎం ఉమా మహేశ్వరరావు, పలువురు పాల్గొన్నారు.

సమాజ సేవే ఎన్‌సీసీ లక్ష్యం కావాలి

చింతలపూడి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ రికార్డులను 19వ ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ అమిత్‌పాండే తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్‌సీసీ అధికారిణి లెఫ్టినెంట్ జీవన్ మౌనిక, వైస్ ప్రిన్సిపల్ నరేంద్రకుమార్ ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందరంగా పాండే విద్యార్థులతో మాట్లాడుతూ రాబోయే సర్టిఫికెట్ పరీక్షలకు అన్ని విధాలుగా సిద్ధంగా ఉండాలన్నారు. క్యాడెట్‌లంతా నాయకత్వ లక్షణాలు అలవర్చు కోవాలన్నారు.

అభివృద్ధి పనులపై సమాచార మేదీ?

సర్పంచ్‌ల ఆవేదన

ఉంగుటూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులపై ప్రజా ప్రతినిధుల దృష్టికి సంబంధిత అధికారులు, సిబ్బంది తీసుకురావడం లేదని పలువురు సర్పంచులు ఆవేదన వ్యక్తం చేసారు. శనివారం ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి అధ్యక్షతన జరిగిన మండల పరిషత్తు సర్వసభ్య సమావేశంలో పలువురు ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ దాతల సహకారంతో జరుగుతున్న నిర్మాణాల విషయంలో, మంజూరు విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. దీనిపై ఎంపిపి శ్రీలక్ష్మి జోక్యం చేసుకుని సంబంధిత సిబ్బంది తగిన జాగ్రత్తలు తీసుకుని ప్రోటోకాల్ పాటించాలని కోరారు. విద్యుత్తు అధికారి వేణు మాట్లాడుతున్న సమయంలో పలువురు ప్రజా ప్రతినిధులు తమ గ్రామాలలో ఉన్న లో ఓల్టేజి సమస్యను ప్రస్తావించారు. మినీ గోకులం షెడ్ల నిర్మాణం విషయమై పథకాన్ని త్వరితంగా పూర్తి చేయాలని ఉపాధి ఏపీవో నాగేశ్వరరావు కోరారు.



ఏలూరు భవిష్య, సెయింట్ థెరిస్సాలో క్రిస్మస్ వేడుకలు



ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

ఏలూరు టూ టౌన్, డిసెంబరు 21 (ఆంధ్ర జ్యోతి): ఈర్ష్యాద్వేషాలు వదిలి ఒకరినొకరు ప్రేమించుకుంటూ ఇతరులకు సహాయ సహకారాలు అందించటమే క్రిస్మస్ పరమార్థమని ఏలూరు కథోలిక పీఠాధిపతులు మోస్ట్ రెవరెండ్ బిషప్ జయరావు పొలిమేర అన్నారు. సోషల్ సర్వీస్ సెంటర్‌లో డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ ఇమ్మానియేలు ఆధ్వర్యంలో సెమి క్రిస్మస్ వేడుకలు శనివారం నిర్వహించారు. ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య ముఖ్య అతిథిగా మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా పేదలకు సహాయం అందించటంలో ఆర్‌సీఎం సంస్థలు ముందుంటాయన్నారు. మంచి సేవా కార్యక్రమాలు చేపడుతున్న ఫాదర్ ఇమ్మానియేలును అభినందించారు. నగర మేయర్ షేక్ నూర్జహాన్ మాట్లాడుతూ సోషల్ సర్వీస్ సెంటర్ ఆధ్వర్యంలో పేదలకు చేస్తున్న సహాయసహకారాలు మరువలేనివన్నారు. ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు సమాజానికి సేవ చేయడానికి ఆర్‌సీఎం సంస్థలు ముందుంటాయని అన్నారు. అనంతరం విహాన్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. క్రిస్మస్ కానుకలు అందజేశారు. చిన్నారులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. క్రిస్మస్‌కేక్ కటింగ్ చేసి క్యాండిల్ సర్వీస్ నిర్వహించారు. మైనార్టీ వెల్ఫేర్ అధికారి శామ్యూల్ కృపావరం, డాక్టర్ జీ.హేమలత, జాన్ మోషే, డాక్టర్ కే.విజయ్‌కుమార్, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి సుధాకర్, సీఐ కోటేశ్వరరావు, ఫాదర్ మరియా జ్యోతి, ఫాదర్ మైఖేల్, ఫాదర్ ఇంజేపాల్ తదితరులు పాల్గొన్నారు.

● శ్రీభవిష్య హైస్కూల్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రదర్శించిన క్రీస్తు జననం నాటిక ఆహుతులను ఆకట్టుకుంది. అనంతరం క్రిస్మస్ కేకు కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల ప్రిన్సిపల్ ఇళ్ళా నాగరాజు, వైస్ ప్రిన్సిపాల్ వినీల, ఉపాధ్యాయిని లంకా హన్నా తదితరులు పాల్గొన్నారు.

దెందులూరు: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి సన్మార్గంలో నడవాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. శుక్రవారం దెందులూరులో రక్షణ సైన్యం - దెందులూరు సేవాస్థానం ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేసి చింతమనేని క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. రక్షణ సైన్యం పాస్టర్లు, సంఘస్తులతో పాటు ఆర్‌సీఎం చర్చి విచారణ గురువు రెవ గోడి అమ్మాన్‌రాజా, సర్పంచ్ తోట యేసమ్మ, టీడీపీ నాయకులు గారపాటి కొండయ్యచౌదరి, యిప్పిలి వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్: తోటివారిపట్ల క్షమాగుణాన్ని కలిగిఉండటమే క్రిస్మస్ సందేశమని స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల సుపీరియర్ మదర్ ఎర్నెస్టైన్ ఫెర్నాండెజ్ అన్నారు. శనివారం సాయంత్రం కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన సెమీక్రిస్మస్ వేడుకలో క్రీస్తు జననాన్ని వివరించే సాంస్కృతిక ప్రదర్శనలు, మతపెద్దల సందేశాలు, కేక్ కటింగ్ కార్యక్రమాలు జరిగాయి. ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ మాట్లాడుతూ క్రిస్మస్ అంటే ప్రేమ, జాలి, దయ వంటివి ఇతరులతో పంచుకునే పండుగ అని పేర్కొన్నారు. ప్రపంచమంతా ఆనందంగా జరుపుకునే పండుగ క్రిస్మస్‌అని వివరించారు. వివిద విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా విద్యార్థుల ఎంపిక

ఏలూరు అర్బన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని (డిసెంబరు 24)పురస్కరించుకుని విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీషు మాధ్యమాల్లో జిల్లా విద్యాశాఖ నిర్వహించిన జిల్లాస్థాయి వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతల జాబితాను డీఈవో వెంకటలక్ష్మమ్మ శనివారం విడుదల చేశారు. ఈ పోటీల్లో ప్రథమస్థానంలో నిలిచిన విజేతలు ఈ నెల 23న విజయవాడలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా తరపున హాజరవుతారని వివరించారు. జిల్లాస్థాయి పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విజేతల వివరాలు ఇలా ఉన్నాయి. వ్యాసరచన తెలుగు మాధ్యమంలో ఏలూరు సుబ్బమ్మదేవి మున్సిపల్ హైస్కూలు 9వ తరగతి విద్యార్థిని వై.దివ్యశ్రీ, ఇంగ్లీషు మాధ్య మంలో శర్వాణి హైస్కూలు 9వ తరగతి విద్యార్థిని యు.తేజశ్రీ, వక్తృత్వం తెలుగు మాధ్యమంలో గార్లమడుగు ప్రభుత్వ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థి కె.పవన్‌కుమార్, ఇంగ్లీషు మాధ్య మంలో శర్వాణి హైస్కూలు విద్యార్థిని జె.భువన పద్మశ్రీ విజేతలుగా నిలిచారని తెలిపారు.

సీఆర్‌ఆర్‌లో ఖోఖో ఎంపికలు

ఏలూరు అర్బన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఆదికవి నన్నయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ, పీజీ కళాశాలల ఖోఖో టోర్నమెంట్ సెలక్షన్లు శనివారం స్థానిక సీఆర్‌ఆర్ కళాశాల క్రీడా మైదానంలో జరిగాయి. వివిద కళాశాలలనుంచి మొత్తం 13 జట్లు పాల్గొన్నాయి. సీఆర్‌ఆర్ విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ మాగంటి ప్రసాద్, కరస్పాండెంట్ డాక్టర్ విష్ణుమోహన్, ప్రిన్సిపాల్ రామరాజు, కోర్సు కో-ఆర్డినేటర్ బాలు సత్యనారాయణ, విశ్వవిద్యాలయ పరిశీలకులు దుర్గారావు, పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

సదస్సుకు ఆలస్యంగా అధికారులు

బుట్టాయగూడెం, డిసెంబరు 21 (ఆంధ్ర జ్యోతి): మండలంలో శనివారం కామయ్యకుంట, పందుగూడెంలో జరిగిన సదస్సుకు వచ్చిన గిరిజనులు అధికారుల కోసం ఎదురు చూసి వెనుతిరిగి వెళ్ళిపోయారు. తహసీల్దార్‌కు కోర్టు కేసుల విషయమై అర్జెంటు పనులు ఉంటడంతో సదస్సుకు రావడం ఆలస్యమైనట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. కాగా అధికారుల కోసం ఎదురుచూసిన నలుగురైదుగురు గిరిజనులు భూ వివాదాలు పరిష్కరించాలని అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. సదస్సులో ఎంపీటీసీ కొవ్వాసు వరలక్ష్మీ, సర్పంచ్ పెడకం విజయలక్ష్మి, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

281 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు పూర్తి

ఏలూరుసిటీ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లాలోని 28 మండలాల్లో మొత్తం 665 రెవెన్యూ గ్రామాలుండగా ఇంతవరకు 281 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరిగాయని జేసీ ధాత్రి రెడ్డి తెలిపారు. ఈ సదస్సులకు 13,102 మంది పాల్గొని 3,163 అర్జీలు అందజేయగా వాటిలో ఇప్పటికే 655 అర్జీలు పరిష్కరించార న్నారు.

చిరస్మరణీయులు జస్టిస్ పర్వతరావు

ఉంగుటూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపునకు కృషిచేసిన జస్టిస్ సుంకవల్లి పర్వతరావు చిరస్మరణీయులని వక్తలు పేర్కొన్నారు. శనివారం సుంకవల్లి సంస్మరణ సభలో ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు, సుంకవల్లి స్మారక విజ్ఞాన భారతి, కామధేను రైతు సంక్షేమ సమితి తదితర సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు.

నేటి నుంచి మహారుద్ర హోమం

నిడమర్రు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మందలపర్రు మరో ఆధ్యాత్మిక శోభకు సిద్ధమవుతోంది. గ్రామంలోని ఉమా నీలకంఠేశ్వర పంచాయతన క్షేత్రంలో ఆదివారం ఉదయం నుంచి మహారుద్రహోమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ధర్మకర్త సరిపల్లె శంకరం తెలిపారు. అమెరికాకు చెందిన వేద పండితులు డా. వెంకట చాగంటి ఆశీస్సులతో వైదిక జ్యోతిష్య పరిశోధకులు యజ్ఞకర్త ఎన్నారై అక్కినప్రగడ రాఘవేంద్ర సాయిశర్మ దంపతులు సంకల్పం చేసిన శ్రీ మహారుద్ర యజ్ఞము ఆదివారం ఉదయం 5 గంటల నుంచి ప్రారంభం కానుంది. 26వ తేదీ సాయంత్రం యజ్ఞము సంపూర్ణమవుతుందన్నారు.

సీపీఐ శతజయంతి ఉత్సవాలు

బుట్టాయగూడెం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 26వ తేదీకి సీపీఐ 100వ సంవత్సరంలోకి అడుగు పెడుతుందని ఈ సందర్భంగా బుట్టాయగూడెంలో జరగబోయే కార్యక్రమాలను జయప్రదం చేయాలని డివిజన్ కార్యదర్శి కారం ధారయ్య పిలుపు నిచ్చారు. శనివారం పార్టీ కార్యాలయం వద్ద 100 సంవత్సరాల పుస్తకాన్ని నాయకులు ఆవిష్కరించారు. మండల అధ్యక్షుడు బేతి కిషోర్, కన్వీనర్ చోడెం దుర్గ, మునీశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఘనంగా అకడమిక్ స్పార్క్ ఎక్స్‌పో

జంగారెడ్డిగూడెం, డిసెంబ రు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో అకడమిక్ స్పార్క్ ఎక్స్‌పో కార్య క్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సైన్స్, మ్యాథ్స్, సోషల్, ఇంగ్లీష్, హిందీ, తెలుగు, కంప్యూటర్ విభాగాలలో ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ మద్దిపాటి చైతన్య మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడ తాయన్నారు. మహేష్, ప్రిన్సిపాల్ నాగమణి, విద్యార్థుల తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థుల ప్రదర్శనలను పరిశీలిస్తున్న చైర్మన్ చైతన్య



అ'పూర్వ' సమ్మేళనం

చింతలపూడి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివిన 1975-77 ఇంటర్మీడియట్ పూర్వ విద్యార్థులు స్థానిక హోటల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆనాటి కళాశాల పరిస్థితులు, పరిచయాలు, స్నేహాలు నెమరవేసుకున్నారు. అప్పట్లో హైస్కూలు, జూనియర్ కళాశాల షిఫ్టు పద్ధతిలో నడిచేవి. ప్రస్తుతం కొందరు రిటైర్ కాగా, మరికొందరు రిటైర్ అయినా ప్రైవేటు ఉద్యోగంలో కొనసాగుతున్నారు. కొందరు రైతులుగా స్థిరపడ్డారు. వీరంతా తమ 50 ఏళ్ళ నాటి గుర్తులు తలచుకుంటూ మాట్లాడుకున్నారు. ఇప్పుడు 30 మంది మాత్రమే కలిశామని, ఇక నుండి ఇలా ప్రతీ ఏటా కలవాలని తీర్మానించుకున్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆనందంగా గడిపారు.

సవాళ్ల స్వాగతం

(ఐదో పేజీ తరువాయి)

ఈ పనులన్నింటికీ సంతృప్తికర నిధులు ఇవ్వాల్సి ఉంది. ఆ క్రమంలో ఆయా నియోజక వర్గాల ఎమ్మెల్యేలు చొరవ తీసుకోవాలి. ఎన్నిక ఏకగ్రీవమే అయినప్పటికీ సాగునీరు దగ్గర నుంచి ప్రాజెక్టు కమిటీల ముందున్న ప్రధాన సవాళ్ళివి.

ఎర్రకాల్వ ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా రమణ

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం మండలం శ్రీకరాటం కృష్ణమూర్తి ఎర్రకాల్వ ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా మండలంలోని లక్కవరానికి చెందిన వందనపు అంజ నాగ వెంకటరమణ, వైస్ చైర్మన్‌గా కొయ్యలగూడెం మండలం రాజవరానికి చెందిన వాడపల్లి రాధాకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో శనివారం నూజివీడు హౌసింగ్ ఈఈ పూలచంద్రశేఖర్ ఎన్నికల అధికారిగా ఎన్నికలు నిర్వహించారు. నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్‌లకు ఆయన నియామక పత్రాలను అందజేశారు. అనంతరం కూటమి నాయకులు చైర్మన్, వైస్ చైర్మన్‌లను పూలమాలలతో సత్కరించారు.

తమ్మిలేరు ప్రాజెక్టు కమిటీ అధ్యక్షుడిగా రమేశ్

చాట్రాయి: తమ్మిలేరు ప్రాజెక్టు కమిటీ ఎన్నిక కూటమికి ఏకగ్రీవం అయ్యింది. అధ్యక్షుడిగా యర్రా రమేశ్ (పోలవరం), ఉపాధ్యక్షుడిగా గుండా వెంకన్న(యర్రంపల్లి) ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి, నూజివీడు డీఎల్పీవో సుందరి ప్రకటించారు. చాట్రాయి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎన్నిక నిర్వహించగా, తమ్మిలేరు ప్రాజెక్టు పరిధిలోని నీటి సంఘా ల అధ్యక్షులు గుండా వెంకన్న, చెలికాని కృష్ణారావు, తక్కెళ్ళపాటి వెంకటేశ్వరరావు, జగ్గవరపు భక్తవత్సలరెడ్డి, యర్రా రమేశ్, వెల్ది అప్పారావు హాజరుకాగా ఎన్నికల అధికారి ఎన్నికల ప్రక్రియ నిర్వహించి గెలుపొందిన వారికి ధ్రువపత్రాలు అందజేశారు. ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులను, నీటి సంఘాల అధ్యక్షులను టీడీపీ నాయకులు సన్మానించారు. ఎంపీడీవో విజయలక్ష్మి, ఏఈఈ పరమానందం తదితరులు పాల్గొన్నారు.

బయోమెట్రిక్ ఆధారంగా జీతాలు సరికాదు

ఏలూరు రూరల్, డిసెంబరు 21 (ఆంధ్ర జ్యోతి) : గ్రామ, వార్డు సచివాలయాల డైరెక్టర్ ఇటీవల గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న ఉద్యోగులందరికి బయోమెట్రిక్ ఆధారంగా జీతాలు ఇవ్వాలంటూ ఆదేశాలు ఇవ్వ డం పట్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామరెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు, ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలనాయుడు తీవ్రంగా ఖండించారు. గతంలో ఏపీ ఎఫ్‌ఆర్ఎస్ అని యాప్ ఇచ్చి అందర్నీ వాటిని ఫేస్ అటెండెన్స్ వేయమని తహసీల్దార్లు చెప్పడంతో అప్పటినుంచి ఆ యాప్‌లోనే అటెండెన్స్ వేస్తున్నారని తెలిపారు. సెలవు, పండురోజుల్లో కూడా పనిచేసిన వీఆర్వోలకు సచివాలయంలో బయోమెట్రిక్ వేస్తేనే జీతాలు బిల్లులు పెడతామని ఆదేశాలు ఇవ్వడం సరికాదన్నారు. ఇప్పటికే ఈ విషయాన్ని సీసీఎల్ఏ దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిపారు. తమకు అదర్ ఆప్షన్ ఇవ్వాలని, లేకపోతే గ్రేడ్-1, 2 వీఆర్వోలకు ఏపీఎస్ఆర్ఎస్‌లో బయోమెట్రిక్ వేసుకునే అవకాశం కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు.

27న టెన్త్ విద్యార్థులకు స్టడీ మెటీరియల్

ఏలూరు అర్బన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి విద్యార్థులకు ఈ నెల 27న 'విజయ కేతనం' పేరిట జిల్లా విద్యాశాఖ, డీసీఈబీ ఆధ్వర్యంలో ముద్రించిన స్టడీ మెటరియల్‌ను అందజేయనున్నట్టు డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు. పరీక్షార్థులకు ఉదయం 8 నుంచి 9 వరకు, సాయంత్రం 4.15 నుంచి 5 వరకు ప్రత్యేక తరగతుల నిర్వహణ జరుగుతోందన్నారు. ఈ స్టడీ మెటీరియల్‌ను జిల్లాలోని అన్ని జడ్పీ, ప్రభుత్వ, బీసీ వెల్ఫేర్ పాఠశాలల్లో చదువుతున్న బాల బాలికలందరికీ ఉచితంగా అందజేస్తామన్నారు. ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న విద్యార్థులకు సాయంత్రంవేళల్లో అల్పాహారం అందజేయడానికి పలు గ్రామాల్లో దాతలు సహకరిస్తుం డటం అభినందనీయమన్నారు. టెన్త్ విద్యార్థులకు, బోధించే ఉపాధ్యాయులకు ఉపకరించేలా యూటీ ఎఫ్ ముద్రించిన మోడల్ టెస్ట్‌పేపర్లను శనివారం స్థానిక ఏఆర్‌డీజీకే మున్సిపల్ హైస్కూలు, మౌలానా అబుల్‌కలాం అజాద్(మాకా) ఉర్దూ హైస్కూళ్లలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బి.గోపిమూర్తి పంపిణీ చేశారు.

ఘనంగా మద్దిపాటి జన్మదిన వేడుకలు

దెందులూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): దెందులూరుకు చెందిన మద్దిపాటి చారిటబుల్ ట్రస్టు చైర్మన్, విజయవాడ రమేష్ ఆసుపత్రి డైరెక్టర్లు మద్దిపాటి కస్తూరి, మద్దిపాటి లక్ష్మీనారాయణ చౌదరి విగ్రహాలను బ్రహ్మయ్య అండ్ కో ఆడిటర్, ప్రస్తుత అక్షయపాత్ర (రోజుకు 20 వేల మందికి ఉచిత ఆహారం అందిస్తున్న) సంస్థ నిర్వాహకులు మద్దిపాటి సీతారామ మోహన్‌రావు ఆవిష్కరించారు. రామమోహన్‌రావు కోడలు శైలజ, మనవడు రామ్ చౌదరి, నీహార్ మోహన్ చౌదరి, సినీ హీరో రామ్ తండ్రి పోతినేని మురళీ, విజయవాడ రమేష్ ఆసుపత్రి చైర్మన్ పోతినేని రమేష్‌బాబు, మహేంద్రలతో కలిసి సీతారామమోహన్‌రావు విగ్రహాలను ఆవిష్కరించారు. స్రవంతి మూవీస్ నిర్మాత రవికిషోర్, ఉషా పిక్చర్స్ అధినేత వడ్లపట్ల బాలకృష్ణారావు, విజయవాడ సిద్ధార్థ అకాడమీ చైర్మన్ బ్రహ్మయ్య అండ్ కంపెనీ నిర్వాహకులు పాలడుగు లక్ష్మణరావు తదితరులు ప్రసంగించారు. అనంతరం మద్దిపాటి సీతారామమోహన్‌రావు పుట్టినరోజు సందర్భంగా ప్రముఖులు కనకదుర్గ మహాలక్ష్మీ బ్యాంకు చైర్మన్ కొమ్మరెడ్డి రాంబాబు, ఉషా బాల కృష్ణారావు, కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఏలూరు డాక్టర్ రమేష్ ఆసుపత్రి మేనేజర్ శివప్రసాద్, రమేష్ ఆసుపత్రి అకౌంటెంట్ ఆలూరి శైలజారాణి, ఆలూరి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు.

మాజీ సీఎం జగన్ జన్మదిన వేడుకలు



ఏలూరు రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా శనివారం ఆ పార్టీ ఏలూరు నియోజకవర్గ కార్యాలయంలో ఏలూరు ఇన్‌ఛార్జ్ మామిళ్ళపల్లి జయప్రకాష్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగా యి. దివ్యాంగులకు అన్నదానం చేశారు. మాజీ డిప్యూటీ మేయర్ ఎన్.సుధీర్‌బాబు, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

టి.నరసాపురం: మర్రిగూడెంలో జగన్ జన్మదిన వేడుకలు వైసీపీ ఎస్టీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కురసం నిరీక్షణరావు ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. మండల వైసీపీ ఎస్టీసెల్ అధ్యక్షులు కురసం రవీంద్ర బాబు, యూత్ నాయకులు పాల్గొన్నారు.

పోలవరం: పోలవరం మండలంలో మండల వైసీపీ కన్వీనర్ బుగ్గా మురళీకృష్ణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుకలు జరిపారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పాలు పంపిణీ చేశారు. మహాత్మాగాంధీ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం నిర్వహించారు.

బుట్టాయగూడెం: మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా శనివారం బుట్టాయ గూడెంలో వైఎస్ విగ్రహం వద్ద వైసీపీ నాయ కులతో కలిసి మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు కేక్ కట్ చేశారు. అనంతరం సామాజిక ఆరోగ్య కేంద్రంలోని రోగులకు పండ్లు, రొట్టెలను పంచారు.

విద్యార్థులకు రామానుజన్ ఆదర్శం



రామానుజన్ పుట్టిన సంవత్సరం ఆకారంలో విద్యార్థులు కూర్చున్న దృశ్యం

టి.నరసాపురం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నేటి విద్యార్థులకు లెక్కల మాంత్రికుడు రామానుజన్ ఆదర్శమని అరసం రాష్ట్ర కార్యదర్శి బీఎస్ సాగర్ అన్నారు. ఆదివారం రామానుజన్ జయంతి, గణిత దినోత్సవాన్ని శనివారం స్థానిక శ్రీ సాయి సూర్య హైస్కూల్ నందు ఘనంగా నిర్వహించారు. రామానుజన్ పుట్టిన రోజు సంవత్సరం ఆకారంలో విద్యార్థులు కూర్చోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కె.పవన్ ఆధ్వర్యంలో విద్యార్థుల రక్త నమూనాలను సేకరించి ఉచిత బ్లడ్‌గ్రూప్ పరీక్షలు చేశారు. బి.ఎస్ సాగర్ మాట్లాడుతూ విద్యార్థులు సుమారు 50కి పైగా మ్యాథ్స్ ప్రాజెక్ట్ చేయడం అభినందనీయం అన్నారు. కరస్పాండెంట్ కంచర్ల పవన్‌కుమార్ పాల్గొన్నారు.

పెదవేగి: రామానుజన్ జీవితాన్ని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని శ్రీసాయి హైస్కూల్ కరస్పాండెంట్ బోయపాటి వెంకటేశ్వరరావు అన్నారు. డిసెంబరు 22వ తేదీ శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని శనివారం పాఠశాలలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తొలుత గణిత ఉపాధ్యాయిని సుప్రజ గణితానికి సంబంధించిన వివిధ పజిల్స్‌ను విద్యార్థులతో చేయించారు. పాఠశాల ఈడీ సాయిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వర్షాలు

ఏలూరు సిటీ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి కారణంగా జిల్లాలో అక్కడక్కడా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. శనివారం జిల్లాలోని చాలా ప్రాంతాల్లో మబ్బులు ఉన్నా పొడి వాతావరణం కొనసాగింది. పగటి ఉష్ణోగ్రతలు పెరిగాయి. అయితే మరో రెండు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేస్తుండడంతో రైతులలో ఆందోళన వ్యక్తమవుతోంది. గడిచిన 24 గంటల్లో జిల్లాలో అత్యధికంగా కొయ్యలగూడెం మండలంలో 7.6 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదు కాగా జిల్లాలో సరాసరి వర్షపాతం 1.1 మి.మీగా నమోదైంది. కామవరపుకోటలో 7.2, పోలవరంలో 6.4, నూజివీడులో 2.2 మి.మీ వర్షపాతం నమోదు కాగా వర్షం కురిసిన మిగిలిన మండలాల్లో 2 మి.మీ కన్నా తక్కువగానే వర్షపాతం నమోదైంది.

సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు నాక్ ఏ గ్రేడ్

పెదపాడు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వట్లూరులోని సర్ సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలకు నాక్ ఏ గ్రేడు లభించినట్లుగా ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. మెరుగైన విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులకు సంబంధించి నాక్ కళాశాలలకు ఏ గ్రేడు గుర్తింపును అందజేస్తుందన్నారు. కళాశాలను మరింత తీర్చి దిద్దడానికి కృషి చేస్తామని చెప్పారు.

రీ సర్వేతో భూ సమస్యలు పరిష్కరిస్తాం

లింగపాలెం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రీ సర్వేతో గ్రామాల్లో భూ సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ నజీ ముల్లాషా అన్నారు. రీసర్వే పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపికైన లింగపాలెం మండలం గణపనేని వారిగూడెంలో రీసర్వే ప్రక్రియను ఆయన ప్రారంభించారు. రీసర్వేకు గ్రామ ప్రజలు సహక రించాలన్నారు. అనంతరం గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూ సమస్యలపై 7 అర్జీలు రాగా వాటిలో 5 సమస్యలను పరిష్కరిం చామన్నారు. డీటీ నాగబాబు, సర్పంచ్ రవీంద్ర, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ప్లేట్లు, గ్లాసుల వితరణ

చింతలపూడి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ముక్కంపాడు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులను గ్రామ టీడీపీ నాయకుడు మానేపల్లి రాజారావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కష్టపడి చదివి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

300 మంది ప్రతినిధులతో రాష్ట్ర సభలు

ఏలూరు కార్పొరేషన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ కార్మిక సంఘానికి చెందిన 300 మంది ప్రతినిధులతో 2025 జనవరి 4, 5, 6 తేదీల్లో ఏలూరు నగరంలో రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రామకృష్ణ తెలిపారు. వ్యవసాయ కార్మికుల సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తామన్నారు. అన్ని జిల్లాలకు చెందిన వ్యవసాయ కార్మిక సంఘ ప్రతినిధులు హాజరుకానున్నట్లు తెలిపారు.

కరపత్రాల ఆవిష్కరణ

కామవరపుకోట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పేదల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతున్న సీపీఐ ఆవిర్భావ దినోత్సవాన్ని ఈనెల 26న నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల కార్యదర్శి టి.వి.ఎస్.రాజు తెలిపారు. ఆవిర్భావోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు.

పారిశుధ్య కార్మికుల సేవలు ఎనలేనివి

పెదపాడు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల పరిశుభ్రతలో పారిశుధ్య కార్మికుల సేవలు ఎనలేనివని వట్లూరు పంచాయతీ ఇవో ఎం.శ్రీనివాస్ తెలిపారు. పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న 40 మంది పారిశుధ్య కార్మికులు, వాటర్ ట్యాంక్ ఆపరేటర్లకు కూటమి నాయకుడు కొమ్మన వెంకటశ్రీధర్ (నాని) ఆర్థిక సహకారంతో పండుగను పురస్కరించుకుని ఒక్కొక్కరికి రూ. 4 వేలు చొప్పున శనివారం అందజేశారు. పుల్లారావు, సిబ్బంది పాల్గొన్నారు.

గృహ హింస సామాజిక రుగ్మత

ఏలూరు అర్బన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గృహహింస-వ్యతిరేకతపై శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ గిరిబాబు మాట్లాడుతూ మహిళలపై హింస సామాజిక రుగ్మతగా వర్ణించారు. స్త్రీలపై అనేకరకాలుగా జరుగుతున్న హింసను నిరసిస్తూ అటువంటి సంఘటనలు జరిగినపుడు సమాచారం అందించాల్సిన టోల్ ఫ్రీ నెంబర్లను విద్యార్థినులకు తెలిపారు. విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లను బహుకరించారు. వైస్‌ప్రిన్సిపాల్ రాంబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కొఠారు ఇంటిముందు కొనసాగుతున్న ఆందోళన

పెదవేగి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పెదవేగి మండలం కొండలరావుపాలెంలో దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ఇంటి వద్ద కోమటిలంక, శ్రీపర్రు గ్రామస్థుల ఆందోళన శనివారం కూడా కొనసాగింది. మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, ఆయన తండ్రి రామచంద్రరావు తమ చెరువుల సొమ్ము ఇచ్చేవరకు ఆందోళనను కొనసాగిస్తామని వారు పేర్కొన్నారు. వీరికి మద్దతుగా తిమ్మారావుగూడెం, మానూరు, మాదేపల్లి, కోటేశ్వర దుర్గాపురం, లింగారావుగూడెం తదితర గ్రామాలకు చెందిన దాదాపు 200 మంది శనివారం కొండల రావుపాలెంలోని కొఠారు ఇంటికి చేరుకుని నిరసన తెలిపారు. లంక గ్రామస్థుడు నేతల రవి మాట్లాడుతూ కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి చెరువులు తవ్వుకున్నామని, 2019లో ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఎన్నికైన కొఠారు అబ్బయ్యచౌదరి దౌర్జన్యంగా చేపల చెరువుల లీజు సొమ్మును తన వద్దే పెట్టుకుని తమ పొట్ట కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. దిగమింగిన సొమ్ము వడ్డీతో సహా కక్కిస్తామని హెచ్చరించారు.

ఆస్తులు.. హక్కులు.. పోరాటాలు

» బజారున పడుతున్న బంధుత్వాలు » శవం తగలడుతున్నా.. శ్మశానంలోనూ సిగపట్లు
» కర్మకాండల ఖర్చులకూ కీచులాటలు » ప్రతి పది కేసుల్లో ఐదు ఆస్తి తగాదాలే
» కోర్టు మెట్లెక్కుతున్న రక్త సంబంధీకులు » సెలబ్రిటీలను వదలని ఆస్తి వివాదాలు



ఆంధ్రజ్యోతి సండే స్పెషల్

పాలకొల్లు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మానవ సంబంధాలు మరుగున పడుతున్నాయి. బంధాలు చివరకు ఆర్థిక సంబంధాలుగానే మిగులుతున్నాయి. తండ్రీకొడుకు, అన్నాతమ్ముడు, అక్కాచెల్లి ఇలా ఏ బంధుత్వమైనా ఆస్తి పంపకం విషయానికొచ్చేటప్పటికి కొట్లాటకు సిద్ధపడుతున్నారు. ఇప్పుడు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పోలీస్ స్టేషన్‌లకు వస్తున్న ప్రతి 10కేసులలో 5కేసులు ఆస్తి తగాదాలతో ముడిపడి ఉంటున్నాయి. నేటి ఆధునిక పోకడలలో మానవ సంబంధాలు మరుగున పడుతూ కేవలం ఆర్థిక సంబంధాలతోనే బంధుత్వాలు మనగలుగుతున్న పరిస్థితుల్లో కుటుంబీకులు మధ్య ఏర్పడుతున్న ఆస్తి తగాదాలపై ఆంధ్ర జ్యోతి అందిస్తున్న ప్రత్యేక కథనం.

ఒకప్పుడు కుటుంబం అంటే కుటుంబ పెద్ద మాటకు విలువ ఉండేది. ఒకే మాటపై కుటుం బం అంతా ముందుకు వెళ్లేది. పండుగలకు, వివాహ శుభకార్యాలకు ఖర్చులు ఆడంబరాలకు కుటుంబ పెద్ద మాటే చెల్లుబాటు అయ్యేది. ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. పెళ్లయిన మూడున్నాళ్లకే దంపతులు కొత్త కాపురం పేరు తో సూక్ష్మ కుటుంబాలకు తెరతీస్తున్నారు. ఇక్కడే ఆస్తి తగాదాలు మొదలవుతున్నాయి. జన్మనిచ్చి న తల్లిదండ్రుల మాటను లెక్క చేయకుండా ఆస్తి పంపకాలకై తనయులు ఘర్షణలకు దిగు తున్నారు. ఇటీవల జిల్లాలో పలు సంఘటనలు వెలుగుచూస్తున్నాయి. ఆస్తి తమ హక్కుగా బావిస్తున్న వారసులు కుటుంబ పెద్దలను హీనంగా చూస్తున్నారు. ఆస్తి ఇస్తేనే తమను కన్నందుకు విలువ ఉంటుందనే విపరీత అర్థాలతో కుటుంబ పెద్దల మనసును గాయపరిస్తున్నారు. సామాన్య కుటుంబాలలో ఆస్తి తగాదాలు తక్కువగా ఉన్నప్పటికీ దిగువ, మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి, కుటుంబాలలో ఆస్తి పంపకాలపై పలు కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి.

- విశేషం ఏమిటంటే వందల, వేల కోట్లు కూడబెట్టిన సెలబ్రిటీ, రాజకీయ కుటుంబాల లోనూ ఆస్తి తగాదాలు వెలుగు చూస్తున్నాయి. వీరికి ఉదాహరణ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి, ఆస్తి తాగాదాలో తనకు అన్యాయం చేశాడంటూ సొంత సోదరి షర్మిల రోడ్డెక్కడం అందరికీ తెలిసిన విషయమే.
- ఎన్నో సందేశాత్మక చలన చిత్రాలతో వెండి తెరపై వెలుగు వెలిగిన సినీనటులు మోహన్ బాబు కుటుంబంలోనూ ఆస్తి తగాదాలు రచ్చగా మిగిలాయి. కొన్ని వెలుగు చూస్తుంటూ ఇంకా బయట పడకుండానే కోర్టులు వరకూ వెళ్తున్నాయి.
- ఇటీవల పాలకొల్లు పట్టణంలో ఆస్తి తగాదాలతో సోదరులు ఘర్షణ పడగా కేసు చివరకు పోలీస్ స్టేషన్‌కు కోర్టుకు వెళ్లింది.
- మరో సంఘటనలో తండ్రి మృతదేహం శ్మశానికి వెళ్లకుండానే ఆస్తి పంపకాలకు వారసులు సిగపట్లు పట్టారు. కర్మ కాండల ఖర్చుకు కీచులాడుకున్నారు. బాధ్యతలు మరిచి కేవలం హక్కులకై పోరాడుతూ కుటుంబ బాంధవ్యాలను చులకన చేస్తున్నారు.
- తగిన పత్రాలు లేకుండా తల్లీ లేదా తండ్రి మృతి చెందితే ఆయా కుటుంబాలలో ఆస్తి పంపకాలకు ప్రాణాలు సైతం లెక్క చేయకుండా పోరాడుతున్నారు. ఇటీవల జిల్లాకు చెందిన ఒక పౌరుడు తమ తండ్రి మరణవార్త విని దుబాయి నుంచి జిల్లాకు వచ్చాడు. తండ్రి కర్మ కాండలు అనంతరం కుటుం బ సభ్యులు ఆస్తి చిట్టాలను విప్పారు. పెద్ద చదువు చదివి దుబాయిలో ఉద్యోగం చేసుకు ంటున్నావు కాబట్టి నీకు ఆస్తిలో వాటా రాద ంటూ తమ్ముడు చెల్లెళ్లు వాదానికి దిగారు. ఇంటి పట్టునే ఉండి పంట మీద వచ్చే ఆదాయం అంతా మీరే తిన్నారు కాబట్టి ఆస్తి నాకే దక్కాలంటూ అన్నయ్య పోరాటం ఇలా వాళ్ల మధ్య ఆస్తి వివాదం ముదిరి పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కారు.
- మరో సంఘటనలో తల్లి వద్ద ఉన్న మొ త్తం సొమ్ము ఆస్తి గుంజేసిన కొడుకు కూతురు తల్లిని వృద్ధాశ్రమంలో వదిలేశారు. ఇలా అనేక సంఘటనలు వాయువరుసలు మరిచి కేవలం తమ పెద్దలు సంపాదించిన ఆస్తినే ప్రధానంగా బావిస్తూ తగాదాలు పడుతున్నారు.
- ఇటీవల లోక్ అదాలత్‌లలో రాజీ అవుతున్న కేసులలో అనేకం ఆస్తి తగాదాలకు సంబంధించిన కేసులే ఉంటున్నాయనీ న్యాయ నిపుణులు చెబుతున్నారు.

సూక్ష్మ కుటుంబాలతో ఆర్థిక అవసరాలు పెరిగి తల్లిదండ్రి, అన్నా తమ్ముడు, అనే బంధుత్వం సైతం కాలరాచి ఆస్తులకై వీధిపోరాటాలు చేస్తున్నారనీ మానసిక అధ్యయన నిపుణులు చెబుతున్నారు. తల్లిదండ్రులు నుంచి వచ్చే సాంక్రమిక ఆస్తులు పంపకం విషయం కుటుంబ సభ్యులంతా సామరస్య వాతావరణంలో పరిష్కరించుకోవడం ద్వారానే తగాదాలు తగ్గుతాయని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. మొత్తంగా మానవ సంబంధాలు మరుగున పడి కేవలం ఆర్థిక సంబంధాలే బలపడుతున్న పరిస్థితుల్లో కుటుంబీకుల మధ్య ఏర్పడుతున్న ఆస్తి తగాదాలు ఆందోళన కల్గిస్తున్నాయని పరిష్కార మార్గంలో ఆయా కుటుంబాలు వ్యవహరించకుంటే సంబంధాలు మరింత దిగజారతాయని సామాజికి అధ్యయన నిపుణులు హెచ్చరిస్తున్నారు.

బాల్యం నుంచి నైతిక విలువలు నేర్పాలి



చిన్నతనం నుంచి పిల్లల్లో నైతిక విలువలు పెంపొందించడం ద్వారా పెద్ద అయ్యాక గొడవలు పడకుండా ఉంటారు. నేటి యాంత్రిక జీవనంలో వ్యక్తిగత స్వార్థం పెరగడం వల్లనే కుటుంబాలలో ఆస్తి తగాదాలు వస్తున్నాయి. పెళ్ళి అయ్యాక మరింత స్వార్థపరులుగా మారుతున్నారు. తల్లిదండ్రులు పిల్లలకు ఆర్థిక బంధాల కంటే మానవ సంబంధాలే గొప్పవని, చిరుప్రాయం నుంచి పదే పదే చెబుతూండాలి. ఆస్తి తగాదాలకు కారణం ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నం కావడం అని చెప్పవచ్చు, తోడబుట్టిన వారి మధ్య ప్రేమానుబంధాలు బలపడేలా చూసే బాధ్యత తల్లిండ్రులదే. క్రమ శిక్షణ అనేది ముఖ్యం. పౌరుల్లో భౌతిక వాదం తగ్గడానికి చిన్నతనం నుంచి పునాదులు వేయాలి. లేదంటే బంధుత్వాలు బీటలు వారి, డబ్బే ముఖ్యం అన్న రీతిలో మారుతారు.

డాక్టర్ చల్లా భారతి, మానసిక వైద్య నిపుణురాలు, పాలకొల్లు

క్రిస్టియన్ల కోసం రూ.150 కోట్లు : మంత్రి కొలుసు



క్రిస్మస్ బహుమతులు అందిస్తున్న మంత్రి

ఏలూరు/నూజివీడు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి):నూజివీడు పట్టణం నెహ్రూశాకాలనీలో స్థానిక నాయకులు బి.ఇళయరాజా, బి.రమేష్, బి.ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రాండ్ సెమీ క్రిస్మస్ వేడుకల్లో రాష్ట్ర గృహ నిర్మాణశాఖ, సమాచార పౌరసంబం ధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి ముఖ్య అతిథిగా పాల్గొని క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కేక్‌కట్ చేశారు. అనంతరం క్రిస్మస్ బహుమతులను, నూతన వస్త్రాల ను వృద్ధులు, పేదలకు అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ క్రిస్టియన్ సోదరుల అభివృద్ధి, సంక్షేమానికి రూ.150 కోట్లు కూటమి ప్రభుత్వం కేటాయించిందని, జెరూ సలేం యాత్రకు, విదేశీ విద్యను అభ్యసించడానికి నిధులు కేటాయించిందన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు

ముసునూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ముసునూరు ఆర్‌సీఎం చర్చిలో శుక్రవారం రాత్రి సెమీక్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. సుందరంగా ఏర్పాటు చేసిన పశువులపాక వద్ద ఫాదర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం యువకులు, చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఫాదర్ జోసఫ్ తంబి క్రిస్మస్ సందేశం ఇచ్చారు. అనంతరం విచారణ గురువులు చిన్నారులతో కలిసి క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు.

మహిళల నెట్‌బాల్ పోటీలు



క్రీడాకారిణిలతో ప్రిన్సిపాల్ నవీన లావణ్యలత

నూజివీడు టౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ఎంఆర్ అప్పా రావు పీజీ కళాశాలలో కృష్ణా యూని వర్సిటీ అంతర్ కళాశాల మహిళల నెట్ బాల్ క్రీడా పోటీలను శనివారం ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ లావణ్యలత ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. విజయవాడ ఎస్‌ఆర్‌ఆర్, సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, దుర్గా మల్లేశ్వర సిద్దార్థ మహిళా కళాశాలలు వరుసగా మూడు స్థానాల్లో నిలిచాయి.

రెవెన్యూ గ్రామసభలో 150 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ శర్మ

ముసునూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రమణక్కపేటలో శనివారం జరిగిన రెవెన్యూ గ్రామసభలో భూ సమస్యలపై వెల్లువలా అర్జీలు వచ్చాయి. ముఖ్యంగా అటవీ భూములకు ఇచ్చిన నాలుగు నోటిఫికేషన్‌లను రద్దు చేసి, 30 ఏళ్ళుగా సాగుచేస్తున్న పేదసాగుదారులకు పట్టాలను ఇవ్వాలని బాధిత రైతులు, గ్రామీణ వ్యవసాయ కార్మికసంఘం మండల కన్వీనర్ వేముల బక్కయ్య ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తమ శర్మకు అర్జీలను అందజేశారు. అలాగే వివిధ భూసమస్యలపై రైతులు అర్జీలు ఇచ్చారు. ఈ గ్రామసభలో 150 అర్జీలు వచ్చినట్లు శర్మ తెలిపారు.

పాలకు అధిక ధర చెల్లిస్తున్నాం..

నూజివీడు టౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కృష్ణా మిల్క్ యూనియన్ మాత్రమే దేశంలో అత్యధికంగా పాలసేకరణ ధర చెల్లిస్తున్నదని యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు తెలిపారు. రావిచర్లలో పాడి రైతులతో ఆయన శనివారం సమావేశం అయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మిల్క్ యూనియన్ ద్వారా ప్రతి నాలుగు నెలలకు ఒక సారి రైతులకు నూటికి రూ.10లు ధర వ్యత్యాసాన్ని చెల్లిస్తున్నామన్నారు. గేదెలకు ఇన్సూరెన్స్ రైతులకు ఇస్తున్న ఇన్సూరెన్స్‌లను రైతులు వినియోగించుకోవాలన్నారు.

ట్రూ అప్ చార్జీలు తగ్గించాలి

ముసునూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పెంచిన విద్యుత్ ట్రూ అప్ చార్జీలను తక్షణమే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు జి.రాజు డిమాండ్ చేశారు. శనివారం చింతలవల్లి మెయిన్ సెంటర్‌లో సీపీఎం నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ గత ప్రభుత్వం విద్యుత్ ట్రూఅప్ చార్జీలపై అదాని సంస్థతో చేసుకున్న ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేసి, విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. అలాగే వ్యవసాయ బోర్లకు స్మార్ట్‌మీటర్లు బిగించే ప్రక్రియను నిలుపుదల చేయాలన్నారు.

గణిత దినోత్సవం

నూజివీడు టౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జాతీయ గణిత దినోత్సవాన్ని నూజివీడు శారద కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణిత అధ్యాపకులు ముత్యాల వేణుగోపాల్ రాసిన గణిత పుస్తకాలను కళాశాల చైర్మన్ పుప్పాల శంకర్రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు.



విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ

చాట్రాయి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ హైదరాబాద్ వారిచే మండలంలోని చనుబండ, సీ గుడిపాడు జడ్పీ హైస్కూల్స్‌లో 25 మంది పేద విద్యార్థినులకు సైకిళ్ళు పంపిణీ చేశారు. క్లబ్ ప్రెసిడెంట్ బాలకోటిరెడ్డి, ప్రాజె క్టు కో-ఆర్డినేటర్, పూర్వ విద్యార్థి వి.లక్ష్మి, పూర్వ విద్యార్థి, క్లబ్ మెంబర్ వజ్రాల రాజ్‌గోపాల్, ఎంఈవో బ్రహ్మచారి, హెచ్‌ఎం భారతి పాల్గొన్నారు.

కల్లులో మత్తు పదార్థాలు కలపవద్దు

నూజివీడు టౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గీత కార్మికుల సమస్యలను ఎక్సైజ్ అధికారుల దృష్టికి తీసుకువచ్చి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ ఎమస్తానయ్య తెలిపారు. శనివారం నూజివీడు ఎక్సైజ్ కార్యాలయంలో కల్లు సొసైటీల అధ్యక్షులతో సమావేశం అయ్యారు. ఈసందర్భంగా మత్తు పదార్థాలను కల్లులో కలుపకుండా చూడాలని ఆయన సూచించారు. అనంతరం బెల్లం వ్యాపారులతో సమావేశం అయ్యి నల్ల, తెల్ల బెల్లం విక్రయాలపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు.

బెల్లం ఊట ధ్వంసం

చాట్రాయి, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): పోతనపల్లిలో సారా తయారీకి సిద్ధంగా ఉన్న 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి కేసు నమోదు చేసినట్లు నూజివీడు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపారు. ఈ దాడిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఫణి, ఎస్సైలు పాల్గొన్నారు.

సవాళ్ల స్వాగతం

(ఐదో పేజీ తరువాయి)

ఈ పనులన్నింటికీ సంతృప్తికర నిధులు ఇవ్వాల్సి ఉంది. ఆ క్రమంలో ఆయా నియోజక వర్గాల ఎమ్మెల్యేలు చొరవ తీసుకోవాలి. ఎన్నిక ఏకగ్రీవమే అయినప్పటికీ సాగునీరు దగ్గర నుంచి ప్రాజెక్టు కమిటీల ముందున్న ప్రధాన సవాళ్ళివి.

ఎర్రకాల్వ ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా రమణ

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం మండలం శ్రీకరాటం కృష్ణమూర్తి ఎర్రకాల్వ ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా మండలంలోని లక్కవరానికి చెందిన వందనపు అంజ నాగ వెంకటరమణ, వైస్ చైర్మన్‌గా కొయ్యలగూడెం మండలం రాజవరానికి చెందిన వాడపల్లి రాధాకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో శనివారం నూజివీడు హౌసింగ్ ఈఈ పూలచంద్ర శేఖర్ ఎన్నికల అధికారిగా ఎన్నికలు నిర్వహించారు. నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన చైర్మన్, వైస్ చైర్మన్‌లకు ఆయన నియామక పత్రాలను అందజేశారు. అనంతరం కూటమి నాయకులు చైర్మన్, వైస్ చైర్మన్‌లను పూలమాలలతో సత్కరించారు.



అధ్యక్ష, ఉపాధ్యక్షుడు, సభ్యులను అభినందిస్తున్న టీడీపీ నాయకులు

తమ్మిలేరు ప్రాజెక్టు కమిటీ అధ్యక్షుడిగా రమేశ్

చాట్రాయి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తమ్మిలేరు ప్రాజెక్టు కమిటీ ఎన్నిక కూటమికి ఏకగ్రీవం అయ్యింది. అధ్యక్షుడిగా యర్రా రమేశ్ (పోలవరం), ఉపాధ్యక్షుడిగా గుండా వెంకన్న(యర్రంపల్లి) ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి, నూజివీడు డీఎల్పీవో సుందరి ప్రకటించారు. చాట్రాయి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎన్నిక నిర్వహించగా, తమ్మిలేరు ప్రాజెక్టు పరిధిలోని నీటి సంఘాల అధ్యక్షులు గుండా వెంకన్న, చెలికాని కృష్ణారావు, తక్కెళ్ళపాటి వెంకటేశ్వరరావు, జగ్గవరపు భక్తవత్సలరెడ్డి, యర్రా రమేశ్, వెల్ది అప్పారావు హాజరుకాగా ఎన్నికల అధికారి ఎన్నికల ప్రక్రియ నిర్వహించి గెలుపొందిన వారికి ధ్రువపత్రాలు అంద జేశారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులు రమేశ్, వెంకన్న విలేకరులతో మాట్లాడుతూ తమ్మిలేరు ప్రాజెక్టుకు అధికారికంగా 12,500 ఎకరాలు ఆయకట్టు ఉందని, సరైన నీటి యాజమాన్య విధానాలు అనుసరించి శివారు భూములకు సాగునీరు అందించడానికి చిత్తశుద్ధితో కృషి చేస్తామన్నారు. జైకా నిధులు రూ.16 కోట్లతో జరుగుతున్న తమ్మిలేరు మరమ్మతు పనులను నాణ్యతతో జరిగేలా చూస్తామన్నారు. ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులను, నీటి సంఘాల అధ్యక్షులను టీడీపీ నాయకులు సన్మానించారు. ఎంపీడీవో విజయలక్ష్మి, ఏఈఈ పరమానందం తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతుకు యూనిక్ నంబరు

నూజివీడు టౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతుకు ఆధార్ నంబరు ద్వారా యూనిక్ నంబరును జారీ చేయా లని ఏవో చాముండేశ్వరి కోరారు. తుక్కు లూరు రైతు సేవా కేంద్రంలో గ్రామ వ్యవ సాయ, ఉద్యాన సహాయకులకు ఫార్మర్స్ రిజిస్ట్రీపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిం చారు. వ్యవసాయ రంగం డిజిటలైజేషన్‌లో భాగంగా ప్రతి రైతుకు 14 అంకెల నంబరు గల సంఖ్యను యూనిక్ నంబరుగా ఆధార్ నంబరుతో అనుసంధానం చేయాలన్నారు.

కొనసాగుతున్న వర్షాలు

ఏలూరు సిటీ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి కారణంగా జిల్లాలో అక్కడక్కడా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. శనివారం జిల్లాలోని చాలా ప్రాంతాల్లో మబ్బులున్నా పొడి వాతావరణం కొనసాగింది. పగటి ఉష్ణోగ్రతలు పెరిగాయి. మరో రెండు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతా వరణ శాఖ హెచ్చరికలు జారీ చేస్తుం డడంతో రైతులలో ఆందోళన వ్యక్తమవుతోంది.

పాదయాత్రగా భవానీలు

మండవల్లి డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండవల్లి, గన్నవరం గ్రామాలు భవానీ నామస్మరణతో మారుమ్రోగింది. మండవల్లిలో జాజుల వంశీకృష్ణ బాబి గురుభవానీ ఆధ్వర్యంలో 28 మంది భవానీ దీక్షపరులకు శనివారం ఇరుముడి కార్యక్రమం జరిగింది. విఘ్నేశ్వరునికి, కనకదుర్గమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. ఇరుముడి కార్యక్రమం అనంతరం దీక్షాపరులు పాదయాత్ర చేస్తూ విజయవాడ బయలుదేరారు. గన్నవరంలో 22మంది భవానీ దీక్షాపరులకు ఘనంగా ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు.

తిరగేసి వదిలేశారు

వడాలి - తాడినాడ రోడ్డులో ప్రజల ఇబ్బందులు

ముదినేపల్లి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వడాలి - తాడినాడ ఆర్ అండ్‌బీ ప్రధాన రహదారి ప్రత్యేక మరమ్మతు పనులు మధ్యలోనే ఆగిపోవడంతో మండలంలోని పలు గ్రామాల ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. సుమారు రూ.65 లక్షల నిధులతో చేపట్టిన ఈ అధ్వానపు రోడ్డు మరమ్మతు పనులను ప్రాథమిక దశ పూర్తి చేసి నిలిపేశారు. వడాలి నుంచి తామరకొల్లు వరకు ఈ రోడ్డును ఎక్స్‌కవేటర్‌తో తవ్వి తిరగేసి రెండు వారాలు గడుస్తున్నా మరమ్మతు పనులకు మెటీరియల్ రాలేదు. సుమారు పది కిలోమీటర్ల దూరం రోడ్డంతా రాళ్లతో వాహనాల రాకపోకలకు ప్రమాదకరంగా మారింది. వడాలి, చినకామనపూడి, పెదకామనపూడి, తూర్పుపాకల, నరసన్నపాలెం, గంగాపురం, చిగురుకోట గ్రామాల ప్రజలు రాళ్లతో నిండిన రాళ్లపై నడిచేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఆర్ అండ్‌బీ అధికారులు వెంటనే మరమ్మతు పనులు పూర్తి చేయించాలని టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి చలసాని జగన్మోహనరావు కోరారు.



వడాలి - తాడినాడ రోడ్డు దుస్థితి



సానారుద్రవరం రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ రామకృష్ణ

భూ సమస్యలపై సత్వరం స్పందించాలి : ఎమ్మెల్యే కామినేని

ముదినేపల్లి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): భూములకు సంబంధించిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు రెవెన్యూ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఆదేశించారు. ముదినేపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద శనివారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడుతూ రీ సర్వే వల్ల గత వైసీపీ ప్రభుత్వం సమస్యలను సృష్టించిందని విమర్శించారు. శాసన మండలి మాజీ సభ్యుడు కమ్మిలి విఠల్ రావు, మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్, టీడీపీ మండల అధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్, టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు, జనసేన మండల కన్వీనర్ వీరంకి వెంకటేశ్వరరావు, తహసీల్దార్ సుభానీ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలు 45 రోజుల్లో పరిష్కారం

కలిదిండి : రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను 45 రోజుల్లో పరిష్కరిస్తామని తహసీల్దార్ రామకృష్ణ తెలిపారు. సానారుద్రవరంలో శనివారం నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. సర్పంచ్ నున్న రాజేశ్వరమ్మ, డీసీ వైస్ చైర్మన్ ఎస్.కృష్ణబాబు, మాజీ సర్పంచ్ భగవాన్లు, ఆర్ఐ శ్యామల, వీఆర్వోలు సారథి, కమల హాసన్ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌ఫెయిర్‌తో సృజనాత్మక శక్తి పెంపు

ఎమ్మెల్యే డాక్టర్ కామినేని



విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శనను తిలకిస్తున్న ఎమ్మెల్యే కామినేని

కైకలూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని పెంపొందించేందుకు సైన్స్ ఫెయిర్ ఎంతగానో దోహద పడుతుందని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. కైకలూరులోని నేషనల్ స్కూల్‌లో శనివారం సైన్స్ ఫెయిర్‌ను ఆయన ప్రారంభించారు. విద్యార్థుల నమూనా ప్రదర్శనలను తిలకించారు. విద్యార్థులు అంతరిక్ష పరిశోధనలు వంటి ప్రదర్శనలు చేయడం అభినందనీయమన్నారు. ఒకే పాఠశాలలో 600పైగా ప్రదర్శనలు చేయడం పట్ల విద్యార్థులను అభినందించారు, స్కూల్ డైరెక్టర్ గురజాడ చంద్రమోహన్, ఎంపీపీ అడవి కృష్ణ, ఇన్‌చార్జి తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం, రూరల్ సీఐ వి.రవికుమార్, ఎంఈవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


అగ్నికుల క్షత్రియుల సంక్షేమమే లక్ష్యం

అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అండ్రాజు



సమావేశంలో మాట్లాడుతున్న అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాస్

కలిదిండి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అగ్నికుల క్షత్రియుల సంక్షేమమే సీఎం చంద్రబాబు లక్ష్యమని అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అండ్రాజు శ్రీనివాస్ అన్నారు. కొండంగిలో శనివారం అగ్నికుల క్షత్రియ సంఘ సమావేశంలో మాట్లాడుతూ ఆదరణ పథకం ద్వారా అగ్నికుల క్షత్రియులకు సబ్సిడీ రుణాలు, పడవలు, వలలు అందించిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. మత్స్యకారులకు 50 ఏళ్లకే పింఛన్ అందిస్తున్నారన్నారు. బీసీల సంక్షేమానికి ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.39 వేల కోట్లు కేటాయించిందన్నారు. వైసీపీ హయాంలో బీసీలను విస్మరించిందన్నారు. ఆదరణ పథకాన్ని రద్దు చేసి అగ్నికుల క్షత్రియుల సంక్షేమానికి తూట్లు పొడిచింద న్నారు. కొండంగి సర్పంచ్ తిరుమలశెట్టి జ్యోతి, అగ్నికుల క్షత్రియుల సంఘ నాయకులు సుబ్రహ్మణ్యం, నాగిడి వీరబ్రహ్మం, పొన్నాల లక్ష్మణరావు, కొల్లాటి నాగరాజు, రాజ్ కుమార్, కమల దాసు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



రామానుజన్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న అధ్యాపకులు

ఘనంగా గణిత దినోత్సవం

కైకలూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణిత దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. శ్రీనివాసా రామానుజన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామానుజన్ జీవిత చరిత్రను, గణిత దినోత్సవ విశిష్టతను వివరించారు. గణిత అధ్యాపకులు టి.రేణుకా దేవి, బి.జగన్మోహనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ వై శ్రీలత, వైస్ ప్రిన్సిపాల్ ఉదయప్రకాశ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయాలి

మండవల్లి డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విజయవాడ సమీపంలోని గన్నవరం విమానాశ్రయం దగ్గర విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జనవరి 5న జరగనున్న హైందవ శంఖారావ మహాసభను విజయవంతం చేయాలంటూ శనివారం ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. అప్పాపురం, అయ్యవారి రుద్రవరం, మండవల్లి, గన్నవరం మోఖాసాకలవపూడి, పుట్లచెరువు, కానుకొల్లు, లింగాల, పెరికే గూడెం, ఇంగిలిపాకలంక ఉనికిలి, పెనుమాకలంక గ్రామాల్లో ఈ మేరకు ప్రచారం చేసి హిందువులు అందరూ పాల్గొని కోరారు.